నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 73 రంగారెడ్డి | శుక్రవారం 10 జులై 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 10-07-2026 | Friday | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy- Siddipet-Medchal-Jagityal-Vemulawada

## బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్: రేవంత్ రెడ్డి



**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:**
హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే అత్యుత్తమ నివాస యోగ్యమైన నగరంగా (బెస్ట్ లివింగ్ సిటీ) తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని సీతారాంపూర్‌లో 'ప్రీమియర్ ఎనర్జీస్' సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన నెక్స్ట్-జెన్ సోలార్ మాడ్యూల్స్ తయారీ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో పారిశ్రామిక, ఆర్థిక రంగాల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు తీసుకోబోతున్న కీలక నిర్ణయాలను వెల్లడించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై స్పష్టమైన ప్రణాళికతో ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2034 నాటికి 1 మిలియన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనను లక్ష్యంగా పెట్టుకున్నామని, అలాగే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా మారుస్తామని భరోసా ఇచ్చారు. దేశ సమగ్ర జీడీపీలో ఏకంగా 10 శాతం వాటా ఒక్క తెలంగాణ నుంచే ఉండేలా తాము టార్గెట్ సెట్ చేసుకున్నట్లు సీఎం ప్రకటించారు. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న పారిశ్రామిక విధానం (ఇండస్ట్రియల్ పాలసీ) దేశంలోనే అత్యుత్తమమైనదని ఆయన కొనియాడారు.

**నగరంలో కాలుష్యానికి బ్రేక్..**

కాలుష్య రహిత హైదరాబాద్ కోసం త్వరలోనే పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలించబోతున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. "కోర్ అర్బన్ ఏరియాను డెవలప్ చేయడానికి ప్రత్యేక పాలసీని తీసుకొచ్చాం. పరిశ్రమలకు ఔటర్ రింగ్ రోడ్ అవతల భూములు కేటాయిస్తాం. ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్‌ల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పారిశ్రామిక వాడలను(మిగతా 3లో..)

## స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించాలి..

### మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్ బాబు



**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:**
ఇందిరమ్మ ఇళ్ల పథకంలో స్టీల్, సిమెంట్ పరిశ్రమలు భాగస్వాములు కావాలని రాష్ట్ర హౌసింగ్, పరిశ్రమల శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. గురువారం సెక్రెటేరియట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు, సరఫరా, పరిశ్రమల సహకారం అంశాలపై ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాదని.. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం, సామాజిక భద్రత, ఆత్మగౌరవాన్ని కల్పించే మహాయజ్ఞమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటికే గణనీయ సంఖ్యలో 85 శాతం ఇళ్ల శ్లాబులు పూర్తయ్యాయని, మిగిలిన 15 శాతం ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. రెండో విడతలో నియోజకవర్గానికి రెండు వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశామని.. అలాగే క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని కార్యాచరణ చేపట్టిందన్నారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా వెయ్యి నుంచి 1,500 ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని.. మూడు, నాలుగవ విడతల్లో కూడా మంజూరు చేస్తామని చెప్పారు.

## నిరుద్యోగులకు అలర్ట్..

### పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్‌పై బిగ్ అప్‌డేట్

**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:**




రాష్ట్రంలో ప్రభుత్వ కొలువుల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తీపికబురు రానేవచ్చింది. ఇటీవల పోలీస్ ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ కసరత్తు పూర్తి చేసి డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను సిద్ధం చేసింది. అయితే, తాజాగా ఆ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను ఆమోదం కోసం సీఎం రేవంత్ రెడ్డికి పంపించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారిక ముద్ర పడగానే వచ్చే వారంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసేందుకు బోర్డు అధికారులు అన్న ఏర్పాట్లు చేశారు. తాజాగా, వెలువడబోయే నోటిఫికేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 7,437 పోస్టులలో వివిధ విభాగాలను భర్తీ చేయనున్నారు. అందులో ఫైర్ డిపార్ట్‌మెంట్ 790 పోస్టులు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో 1,424 పోస్టులు, జైళ్ల శాఖలో 223 పోస్టులు, పోలీస్ శాఖలోని ఇతర విభాగాల్లో 5 వేల పోస్టులు ఉన్నాయి. ఆర్థిక శాఖ అనుమతితో పాటు రిక్రూట్‌మెంట్ బోర్డు కూడా నోటిఫికేషన్ విడుదలకు సిద్ధంగా ఉండటంతో అభ్యర్థులు తమ ప్రిపరేషన్‌ను వేగవంతం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## హరీష్‌రావు మీద నమ్మకం లేకనే కేసీఆర్ తొలగించారు..




**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:**
ఇరిగేషన్ (సాగునీటి) రంగంపై మాజీ మంత్రి హరీష్ రావు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా చేసిన విమర్శలపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ ఘాటుగా స్పందించారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. హరీష్ రావు వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డారు. సాగునీటి రంగంలో హరీష్ రావు పెద్ద నిష్ణాతుడైనట్లు మాట్లాడుతున్నారని మంత్రి ఉత్తమ్ ఎద్దేవా చేశారు. "ఇరిగేషన్లో హరీష్ రావు అంత నిష్ణాతుడే అయితే, గత ప్రభుత్వంలో ఆయన మామ కేసీఆర్ ఆ శాఖ నుంచి ఎందుకు తొలగించారు? హరీష్ రావు పనితీరుపై కేసీఆర్‌కు ఏమాత్రం నమ్మకం లేకనే ఆయనను నీటి పారుదల శాఖ మంత్రి పదవి నుంచి రాత్రికి రాత్రే తీసేశారు" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

**సరైన సమయంలో పూర్తి సమాధానం చెప్తా..**

కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా హరీష్ రావు ప్రెజెంటేషన్లు ఇస్తున్నారని మంత్రి మండిపడ్డారు. హరీష్ రావు చేసిన వ్యాఖ్యలకు, చూపించిన గణాంకాలకు తాము వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆయన చేసిన ప్రతి విమర్శకు, ఆరోపణకు తాము సరైన సమయంలో, తగిన ఆధారాలతో సహా పూర్తి సమాధానం చెప్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి 'ఏటీఎం'గా మారింది

### కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా



**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:**
తెలంగాణలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం (జూలై 9, 2026) తెలంగాణలో పర్యటించిన ఆయన.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవినీతిమయ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 'కాళేశ్వరం ప్రాజెక్ట్'ను తమకు ఏటీఎంలా వాడుకుంటే, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మొత్తం తెలంగాణ రాష్ట్రాన్నే ఢిల్లీలోని తమ హైకమాండ్‌కు 'ఏటీఎం'గా మార్చేసిందని నడ్డా ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధిని పూర్తిగా అటకెక్కించి, నిధులను ఢిల్లీకి తరలిస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి చెందాలంటే ఇక్కడ కూడా బీజేపీ ఆధ్వర్యంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

**80 కోట్ల మందికి ఆహార భద్రత**

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశం అన్ని రంగాల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని జేపీ నడ్డా స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలన, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొంటూ.. దేశవ్యాప్తంగా సుమారు 80 కోట్ల మంది ప్రజలకు తాము ఉచిత రేషన్ ద్వారా ఆహార భద్రత కల్పిస్తున్నామని గుర్తుచేశారు. ఇందులో భాగంగానే తెలంగాణలో కూడా దాదాపు కోటి 20 లక్షల మంది ప్రజలకు 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన' కింద ఉచితంగా బియ్యం, పప్పుధాన్యాలను అందిస్తూ కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని నడ్డా వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

## ఉద్యోగాలు కావాలంటే క్రీడల్లో రాణించండి..

## యువతకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:**
గడిచిన 20 ఏళ్లలో తెలంగాణలో ఎలాంటి స్పోర్ట్స్ ఈవెంట్ నిర్వహించలేదని, హైదరాబాద్‌లో ఒలింపిక్స్ నిర్వహించాలన్నది తన జీవిత కల అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్ ను పీటీ ఉషతో కలిసి ప్రారంభించారు. అలాగే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీని కూడా ప్రారంభించి, స్పోర్ట్స్ వర్సిటీ వెబ్ సైట్, లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రన్నర్ గా పీటీ ఉష మనందరికీ మంచి స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. 2036లో భారత్ ఒలింపిక్స్ కు ఆతిథ్యమివ్వనుందని, అందుకు హైదరాబాద్ వేదిక కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఒలింపిక్స్ లో పతకాలు సాధించడంలో భారత్ ఎప్పుడూ చివరనే ఉంటోందన్న సీఎం.. కొందరు ఒలింపిక్స్, ఇతర గేమ్స్ లో రాణించినా దేశానికి సరైన గుర్తింపు రావడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేసే విధానాలే స్పోర్ట్స్ లో దేశం ఈ దుస్థితిలో ఉండటానికి ప్రధాన కారణమని సీఎం రేవంత్ ఆరోపించారు. అందుకే క్రీడాకారుల్ని సరైన దిశలో నడిపించేందుకే స్పోర్ట్స్ వర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకే స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చామని పేర్కొన్నారు. (మిగతా 3 లో..)



## ప్రజలు కేసీఆర్‌ను సీఎంగా చూడాలనుకుంటున్నారు..: జోస్యం చెప్పిన కేటీఆర్

**నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్:**



తెలంగాణలో ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పనై పోయిందని, ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్ దే విజయమని కేటీఆర్ జోస్యం చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలతో నిర్వహించిన సమావేశంలో గురువారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి తన వరి పాలన, నాయకత్వంపై చేయించుకున్న సొంత సర్వేలోనే ఈ విషయాలు వెల్లడయ్యా యని పేర్కొన్నారు. సీఎం సర్వేలో కాంగ్రెస్ పై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా వ్యక్తమయిందని, ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ 78 సీట్లు గెలుస్తుందని వెల్లడైందన్నారు. మీడియా, ఇంటెలిజెన్స్ విభాగాల ప్రజాభిప్రాయ సేకరణలో కూడా ఇదే విషయం స్పష్టమయిందని తెలిపారు.

(మిగతా 3 లో..)

నిర్భయవార్త
సంపాదకీయం
శుక్రవారం 10 జులై 2026

# మత్స్యకారులకు రక్షణ ఏదీ?

విశాఖపట్నం తీరంలో సముద్రంలో వేటకు వెళ్లిన ఆరుగురు మత్స్యకారులు గల్లంతు కావడం తీవ్ర బాధాకరం. భారత నౌకాదళం, కోస్ట్‌గార్డు, మెరైన్ పోలీసులు రోజుల తరబడి గాలింపు చర్యలు జరిపినప్పటికీ ఎటువంటి ఫలితం కనిపించలేదు. దీంతో బాధిత కుటుంబాల ఆశలు అడియాసలయ్యాయి. నాలుగు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనలో వేటకు వెళ్లిన ఏడుగురిలో ఒక్కరు మాత్రమే ప్రాణాలతో బయటపడ్డారు. 72 గంటల పాటు గాలింపు జరిపినా మిగిలిన వారి ఆచూకీకి సంబంధించి ఎటువంటి వివరాలు తెలియకపోవడంతో నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం కూడా ప్రకటించేసింది! ఈ ఘటన రాష్ట్రంలో మత్స్యకారుల భద్రత ఎంత నిర్లక్ష్యానికి గురవుతోందో మరోసారి గుర్తు చేసింది. గుజరాత్ తరువాత విశాలమైన సముద్ర తీరం కలిగి, దేశంలోనే సముద్ర చేపల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న మన రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు, ఎగుమతులకు, ఆహార భద్రతకు ఈ రంగం విశేషంగా దోహదపడుతున్నప్పటికీ, సముద్రంలోకి వెళ్లే మత్స్యకారుడి ప్రాణాల భద్రతకు అవసరమైన పటిష్టమైన వ్యవస్థ ఇంకా ఏర్పడకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరహా ప్రమాదం జరగడం ఇదే మొదటిసారి కాదు. గత కొన్నేళ్లుగా సముద్రంలో మత్స్యకారులు గల్లంతవడం, తుఫానులకు బలికావడం, పడవలు ప్రమాదాలకు గురికావడం అప్పుడప్పుడు జరుగుతూనే ఉన్నాయి. 2018లో 'ఫెథాయ్' తుఫాను సమయంలో విశాఖ తీరంలో ఏడుగురు మత్స్యకారులు గల్లంతయ్యారు. 2023లో విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 43 పడవలు పూర్తిగా దగ్ధమై వందలాది కుటుంబాలు తీవ్ర ఆర్థిక నష్టాన్ని చవిచూశాయి. ప్రతి ప్రమాదం తర్వాత సహాయక చర్యలు చేపట్టడం తప్ప, ప్రమాదాలను నివారించే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.సముద్రంలో చేపల లభ్యత క్రమంగా తగ్గుతోంది. కేంద్ర సముద్ర మత్స్య పరిశోధన సంస్థ (సి.ఎం.ఎఫ్.ఆర్.ఐ) గణాంకాల ప్రకారం 2025లో ఆంధ్రప్రదేశ్ సముద్ర చేపల ఉత్పత్తి గత ఏడాదితో పోలిస్తే సుమారు 13 శాతం తగ్గింది. వాతావరణ మార్పులు, సముద్ర కాలుష్యం, అధిక వేట, సముద్ర జీవవైవిధ్య క్షీణత ఇందుకు ప్రధాన కారణాలు. తీర ప్రాంతాల్లో చేపలు తగ్గిపోవడంతో చిన్న మత్స్యకారులు వందల కిలోమీటర్ల దూరం లోతట్టు సముద్రంలోకి వెళ్లాల్సి వస్తోంది. ప్రయాణం ఎంత పెరుగుతుందో, ప్రమాదం కూడా అంతే పెరుగుతుందన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇదే సమయంలో భారీ మెకనైజ్డ్ ట్రాలర్లు, ఆధునిక వేట నౌకలు సంప్రదాయ మత్స్యకారుల జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నాయి. తీర ప్రాంతాల్లో చిన్న పడవలకు దొరికే చేపలను కూడా పెద్ద నౌకలే కొల్లగొడుతున్నాయి. దీంతో చిన్న మత్స్యకారులు మరింత లోతట్టు సముద్రంలోకి వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడుతోంది. ఇది వారి ఆదాయాన్ని మాత్రమే కాదు, ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెడుతోంది. ఇటీవలి కాలంలో ప్రభుత్వం తీర ప్రాంతాలను పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు, పర్యాటక ప్రాజెక్టులు, కార్పొరేట్ పెట్టుబడుల కోసం పెద్ద ఎత్తున కేటాయిస్తోంది. అయితే, అంతే శ్రద్ధను మత్స్యకారుల భద్రత విషయంలో చూపడం లేదు. ఫలితంగా తీరంలో తరతరాలుగా జీవిస్తున్న మత్స్యకారుల భద్రత, జీవనోపాధి, సంప్రదాయ వేట హక్కులు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. గత ఏడాది ప్రభుత్వం పంపిణీ చేసిన జిపిఎస్ పరికరాల నాణ్యతపై వస్తున్న విమర్శలు కూడా ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. ఈ పరికరాలకు సిగ్నల్ సరిగా అందడంలేదని, అత్యవసర పరిస్థితుల్లో పనిచేయడం లేదని మత్స్యకారులు చెబుతున్నారు. తాజా సంఘటనలోనూ జిపిఎస్ సరిగా పనిచేసి ఉంటే ప్రమాదం నుండి మత్స్యకారులు సకాలంలో బయటపడి ఉండేవారని అంటున్నారు. ఈ ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలి. భద్రతా పరికరాలు పంపిణీ చేశామని చెప్పుకోవడంతోనే సరిపోదు. అవి సముద్రంలో సమర్థంగా పనిచేస్తున్నాయా లేదా అన్నదే అసలు ప్రశ్న.వాతావరణ మార్పుల ప్రభావం సముద్ర జలాలపై తీవ్రంగా పడుతోంది. తక్కువ సమయంలోనే చోటుచేసుకుంటున్న ఉత్పాతాలు పెనుప్రమాదాలుగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కేవలం జిపిఎస్ ఒక్కటే సరిపోదు. ప్రతి పడవలో శాటిలైట్ ఆధారిత వెసెల్ మానిటరింగ్ సిస్టమ్ (విఎంఎస్) అత్యవసర సంకేత పరికరాలు, నమ్మకమైన కమ్యూనికేషన్ వ్యవస్థ, ఆటోమేటిక్ గుర్తింపు వ్యవస్థ, రియల్‌టైమ్ వాతావరణ హెచ్చరికలు వంటి ఆధునిక వ్యవస్థలు తప్పని సరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. వీటి ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే చేయాలి. సముద్రంలోకి వెళ్లిన ప్రతి పడవను నిరంతరం పర్యవేక్షించేందుకు తీరంలో కంట్రోల్ సెంటర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. దీనికోసం కోస్ట్‌గార్డు, నౌకాదళం, మెరైన్ పోలీసులు, మత్స్యశాఖల మధ్య 24 గంటలు సమన్వయం ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మత్స్యకారులకు క్రమం తప్పకుండా భద్రతా శిక్షణ ఇవ్వాలి. అనేక దేశాల్లో ఇప్పటికే అమలులో ఉన్న ఈ తరహా చర్యలను మన దేశంలోనూ వర్తింపచేయడానికి అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ప్రమాద పరిస్థితుల్లో గాలింపు చర్యలను మరింత ముమ్మరంగా చేపట్టాలి. మరిన్ని నౌకలు, హెలికాప్టర్లు, శాటిలైట్ డేటా, సముద్ర ప్రవాహాల నమూనాలను వినియోగించాలి. చైనా వంటి దేశాలు దీర్ఘ శ్రేణి విమానాలను కూడా తమ దేశ మత్స్యకారుల ఆచూకీ కనుగొనడానికి వినియోగిస్తున్నాయి. రక్షణ చర్యల్లో ప్రతి గంటా విలువైనదే కాబట్టి ఎటువంటి అలసత్వానికి తావులేకుండా ఆ చర్యలు ఉండాలి. తాజా ఘటనలోనూ గల్లంతైన వారు ఏమయ్యారో తేల్చేంతవరకు గాలింపు చర్యలను కొనసాగించాలి. రాష్ట్రానికి వేల కోట్ల రూపాయల విలువైన సంపదను అందిస్తున్న మత్స్యకారుల ప్రాణాలకు భద్రత కల్పించడం ప్రభుత్వాల కనీస బాధ్యత! ఆ విషయాన్ని పాలకులు గుర్తించాలి.

# కనీస వేతనాలు, సామాజిక భద్రత కోసం...

పిల్లల సమగ్రాభివృద్ధికి అన్ని రకాల పునాది వేసేది ఐసిడిఎస్. దేశవ్యాప్తంగా నేడు 7,076 ప్రాజెక్టులతో 13 లక్షల 42 వేల 146 అంగన్వాడీ సెంటర్లను గ్రామ, పట్టణ నివాస ప్రాంతాల్లో విస్తరించింది. ఈ కేంద్రాల ద్వారా 8.48 కోట్ల మంది పిల్లలకు, 1.95 కోట్ల మంది గర్భిణీలు, బాలింతలకు (మన రాష్ట్రంలో సుమారు 32 లక్షల మందికి) ఐసిడిఎస్ ద్వారా సేవలందిస్తున్నారు. లక్ష్యాలు, అభివృద్ధి ప్రచారానికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించడంలేదు. ఈ పథకంలో పని చేస్తున్న 27 లక్షల మంది అంగన్వాడీలను, హెల్పర్లను కనీసం కార్మికులుగా కూడా గుర్తించలేదు. ఐసిడిఎస్ పథకం ప్రారంభించిన తర్వాత అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు అవసరమైన పోషకాహారం, వ్యాధి నిరోధక టీకాలు, ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం వల్ల




మాతృ మరణాలు 86 , శిశు మరణాలు 71 శాతం తగ్గాయి. మొదటి దశలో కేంద్ర ప్రభుత్వం ?ఐసిడిఎస్ కి 100 శాతం నిధులు కేటాయించింది. 2006 తర్వాత కేంద్రం రాష్ట్రాల వాటాలు 90:10 కేటాయించారు. 2014లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 60:40గా మార్పు చేశారు. దీనివలన రాష్ట్రాలపై అదనపు భారం పడింది. తర్వాత సరిపడా బడ్జెట్ కేటాయించడంలేదు. కేంద్ర ప్రభుత్వం ?2026–27లో ఐసిడిఎస్ పథకానికి కేవలం రూ. 21,970 కోట్లు కేటాయించింది. ప్రైవేటీకరణ దిశలో వేగంగా పావులు కదుపుతున్నది. వేదాంత, అక్షయ పాత్రకు సెంటర్ల నిర్వహణ బాధ్యతను అప్పగిస్తున్నది. నూతన విద్యా విధానం తీసుకొచ్చి సెంటర్లను విలీనం చేయాలని నిర్ణయించింది. ఆధార్ లింక్ చేయడంతో పాటుగా పోషణ ట్రాకర్ వంటి రకరకాల యాపులు తెచ్చి లబ్ధిదారులను తగ్గిస్తున్నారు. కొన్ని సెంటర్ల పర్యవేక్షణ కార్పొరేట్లకు ఇవ్వాలని నిర్ణయించారు.ఐసిడిఎస్ ఏర్పడి 50 సంవత్సరాలైనా నేటికీ అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించలేదు. ఎటువంటి సామాజిక భద్రతా సౌకర్యాలు అమలు కావటం లేదు. అంగన్వాడీల పోరాటాల ఫలితంగా 2022 ఏప్రిల్‌లో దేశవ్యాప్తంగా వీరికి గ్రాట్యుటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఐసిడిఎస్ అనేది శాశ్వతమైన పథకం. అందులో పని చేస్తున్న అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అంతవరకు వర్కర్లకు రూ.24,800, హెల్పర్లకు రూ.20,300 వేతనం ఇవ్వాలని 2024లో గుజరాత్ హైకోర్టు ?తీర్పు చెప్పింది. ఈ రెండు తీర్పులను మోడీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలు చేయకుండా మోసం చేస్తోంది. 2014 నుండి కేంద్ర ప్రభుత్వం, 2019 నుండి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు గౌరవ వేతనాలు పెంచలేదు.తిండి, బట్ట, ఇంటి అద్దెలు, రవాణా, కరెంట్ ఖర్చులకు సరిపడా కనీస వేతనం ఉండాలని ఐ.ఎల్.ఒ (1957) తీర్మానించింది. దీనికి అదనంగా కనీస వేతనంలో 25 శాతం చదువులు, ఆరోగ్యాలు, వినోదాలు, పండుగలకు ఉండాలని 1992లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. వీటన్నింటిని కలుపుకుంటే నేటి ధరల్లో కనీస స్థాయి కార్మికులకు రూ. 26 వేలు ఇవ్వాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది. కార్మికులు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక కోడ్లను అమల్లోకి తెచ్చి, ఉన్న హక్కులను తొలగిస్తున్నారు.కనీస వేతనాలు, సామాజిక భద్రత, ఇతర సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో అంగన్వాడీలు 42 రోజులపాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించగా 100 శాతం కార్మికులు పాల్గొన్నారు. ఆ సందర్భంగా సమ్మె శిబిరాల దగ్గరికి వచ్చి...మన ప్రభుత్వం వచ్చిన వెంటనే అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని, సమస్యలు పరిష్కారం చేస్తామని...నేటి సి.ఎం, మంత్రులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయినా నేటికీ అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదు. అంగన్వాడీలకు 1972 గ్రాట్యూటీ చట్టం అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పుంది. కానీ మన రాష్ట్రంలో గ్రాట్యూటీ చట్టానికి విరుద్ధంగా 2025 మార్చి 7న జీవో నెం.8 ఇచ్చారు. కేవలం రిటైర్ అయిన వారికి, చనిపోయిన వారికి మాత్రమే గ్రాట్యూటీ చట్టాన్ని అమలు చేస్తామని తెలియజేశారు. ఐదు సంవత్సరాల సర్వీస్ పూర్తయి మధ్యలో మానుకున్న వారికి కూడా గ్రాట్యూటీ చట్టం అమలు కావడం లేదు. రాజకీయ జోక్యం వలన కొంత మంది హెల్పర్లు ప్రమోషన్ కోల్పోతున్నారు. అనేక పోరాటాల ఫలితంగా 4,867 మినీలు మెయిన్ వర్కర్లుగా అప్డేట్ కావడం సంతోషకరం. ఇంకా 18 సెంటర్లు పెండింగ్‌లో వున్నాయి. కొన్ని మినీ సెంటర్లను విలీనం చేస్తున్నారు. పిల్లలు లేరనే సాకుతో గుంటూరు జిల్లాలో అంగన్వాడీ కేంద్రాలను తగ్గించేందుకు గ్రామాల్లో సెంటర్లను మూసేసి వేరే గ్రామానికి ట్రాన్స్ఫర్ చేస్తున్నారు. ఇది అంగన్వాడీ లక్ష్యానికి విరుద్ధంయుద్ధం వల్ల అంగన్వాడీ సెంటర్ కి గ్యాస్ సమస్య తీవ్రంగా ఉంది. ఎఎస్ఆర్ జిల్లాలో బ్లాక్ లో రూ.3 వేలకి గ్యాస్ కొని పిల్లలకు వండి పెడుతున్నారు. ప్రభుత్వం మాత్రం ఒక్కో చిన్నారికి గ్యాస్ ఖర్చు నిమిత్తం 50 పైసలు ఇస్తుంది. ఇది ఏమాత్రం సరిపోవట్లేదు. గత ప్రభుత్వం ఆధ్వర్యంలో అంగన్వాడీ సెంటర్లకు రేషన్ షాప్ ద్వారా వచ్చే సరుకులు నేరుగా సెంటర్లకు వేసేవారు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ వెహికల్ని ఆపేశారు. అంగన్వాడీ వర్కర్లే పెట్టుబడి పెట్టి రేషన్ షాపుల నుండి సరుకులు తెచ్చుకుంటున్నారు. రవాణా ఖర్చులు ఇస్తామన్నారేగాని నేటికీ అమలు చేయలేదు. ఒక్కో సెంటర్ సరుకులు తెచ్చుకోవడానికి రూ.200 నుండి రూ. 500 వరకు ఖర్చు అవుతుంది. ఏజెన్సీ ప్రాంతాలకు ఇంకా ఎక్కువగానే ఖర్చవుతుంది. ప్రతి నెలా అంగన్వాడీలు రిపోర్టులు ఇవ్వడానికి సెక్టార్ మీటింగ్ కి వెళ్లాలి. 2017 నుండి డి.ఎ బిల్లులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసింది. 2023లో 42 రోజుల సమ్మె ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుండి కనీసం నెలకి ఒక టి.ఎ ఇస్తామని జీవో ఇచ్చినా అమలు లేదు. 0 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలకు, హెల్త్ కు సంబంధించిన వివరాలన్నింటినీ మరో యాప్ లో చెయ్యాలని, రాష్ట్రమంతటా ట్రైనింగ్ ఇచ్చారు. ఇది అంగన్వాడీ టీచర్లకు అసాధ్యమైన పని. ఇది హెల్త్ డిపార్ట్మెంట్ చేయాల్సినది. దీనిని కూడా అంగన్వాడీలకు అప్పగించాలని ప్రభుత్వం ట్రైనింగ్ ఇచ్చింది. ?యూనిఫామ్ లు ఇవ్వలేదు. డిపార్ట్మెంట్ లో అందరూ మహిళలే. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ అమలు గురించి పట్టించుకోవడం లేదు. 2023 సంవత్సరానికి సంబంధించిన కాన్వెంట్ బిల్లు ఇవ్వకుండా ఎగనామం పెట్టారు. నేడు వాటిని ఇవ్వలేమని చెబుతున్నారు. రకరకాల యాప్‌ల వల్ల అంగన్వాడీ సెంటర్ల నిర్వహణ దినదిన గండంగా ఉంది. ఈ సమస్యల పరిష్కారం కోసం జులై 10 అంగన్వాడీ కోర్కెల దినం సందర్భంగా పై డిమాండ్లను పరిష్కరించాలని జిల్లా కలెక్టరేట్ దగ్గర దేశవ్యాప్తంగా బ్లాక్ డే జరుగుతుంది. నిరసన కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నాం.

# ఫీజుల నియంత్రణ ఏదీ?

నేడు రాష్ట్రంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజీల ఫీజులు చూస్తే కళ్లు తిరగాల్సిందే. చదువుకునే రోజులు పోయి చదువు కొనే రోజులు వచ్చాయి. పిల్లల చదువు కోసం వేలల్లో, లక్షల్లో సొమ్ములు చూసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. విజయవాడలోని ఓ కార్పొరేట్ స్కూల్లో పదో తరగతి విద్యార్థికి స్కూల్, హాస్టల్ కలిపి మొత్తం లక్ష రూపాయలు, కొన్ని స్కూళ్లలో ఎల్.కె.జి, ఇంటర్ ఫీజులే సుమారు రూ.50 వేల నుంచి రూ.1 లక్ష మధ్యలో వసూలు చేస్తున్నారు. తమ పిల్లలకు ఇంగ్లిష్ మీడియంలో చదువు చెప్పించాలనే ఉద్దేశ్యంతో అడ్మిషన్ల కోసం ప్రైవేట్ స్కూళ్లకు వెళుతున్న తల్లిదండ్రులు అక్కడి ఫీజులు చూసి, వాటిని కట్టడం తమ వల్ల కాదని నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి. ప్రభుత్వం ఎన్ని జీవోలు, నిబంధనలు రూపొందించినా తమ రూల్ తమదే అనేలా కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు ప్రవర్తిస్తున్నాయి. కొన్ని స్కూళ్లు అయితే ఒకేసారి మొత్తం అడ్మిషన్ ఫీజు, పాఠశాల ఫీజు కట్టాలనే నిబంధనలను అమలు చేస్తున్నాయి.




**విద్యాహక్కు చట్టం అమలేదీ...**

విద్యాహక్కు చట్టం సెక్షన్–6 ప్రకారం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అడ్మిషన్లు జరగాలి. సెక్షన్ –11లో సూచించిన విధంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు గవర్నింగ్ బాడీ నిర్ణయించిన ఫీజులను మాత్రమే వసూలు చేయాలి. వసూలు చేసే ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో పెట్టాలి. సెక్షన్ –12 ప్రకారం విద్యార్థుల, ఉపాధ్యాయుల నిష్పత్తి 1:20కి మించరాదు. ప్రతి పాఠశాలలో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు, మైనార్టీలకు కేటాయించాలి. ఇందులో వికలాంగులు, అనాథలు, హెచ్ఐవి బాధితులు, వీధి బాలలకు 5 శాతం, ఎస్సీ బాలలకు 10 శాతం, ఎస్టీ బాలలకు 4 శాతం, వెనుకబడిన బలహీన వర్గాలకు 6 శాతం కేటాయింపు జరిగింది. మొత్తం 25 శాతం. వీటి ప్రకారం ఎక్కడా పూర్తి స్థాయిలో అమలు జరగడంలేదు. సెక్షన్ 18 ప్రకారం ప్రభుత్వ నిర్ణీత గడువు తర్వాత కూడా గుర్తింపులేని పాఠశాలను నడిపితే రూ. లక్ష జరిమానా విధిస్తారు. ఒకవేళ జరిమానా తర్వాత కూడా గుర్తింపు లేకుండా మళ్లీ పాఠశాలను నిర్వహిస్తే రోజుకు రూ.10 వేలు జరిమానా విధిస్తారు. ఏ పాఠశాలలోనూ బోధనా రుసుం కాకుండా ఇతర రూపాల్లో ఎలాంటి ఫీజు (క్యాపిటేషన్ ఫీజు) వసూలు చేయరాదు. అలా చేస్తే దానికి 10 రెట్లు జరిమానా విధిస్తారు.

**పుస్తకాల అమ్మకాలు అరికట్టాలి**

ప్రైవేటు విద్యాసంస్థలు అక్రమంగా విద్యాసామగ్రిని విక్రయిస్తున్నాయి. విద్యాహక్కు చట్టం ప్రకారం ఏ విద్యాసంస్థలో కూడా పుస్తకాలు, యూనిఫామ్ అమ్మరాదు. అలా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా అలా జరగడం లేదు. తమ దగ్గరే యూనిఫామ్, పుస్తకాలు కొనుగోలు చేయాలంటూ విద్యాసంస్థల యాజమాన్యాలు అధిక ధరలు వసూలు చేస్తున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ పెద్దలకు చెందినవి కావడంతో చర్యలు తీసుకోవడానికి అధికారులు వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు తమకు నచ్చిన చోట విద్యాసామగ్రిని తెచ్చుకునే సౌలభ్యం కల్పించాలి. విద్యాశాఖ నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి.

**అధికారుల నిర్లక్ష్యం**

ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు, స్కూళ్లలో ఫీజుల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తోంది. నేడు రాష్ట్రంలో కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు మండల స్థాయి వరకు విస్తరించి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తుంటే ప్రభుత్వం, అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు జలగల్లా పట్టి పీలుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిటీ వేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళు మొత్తం సీట్లలో 25 శాతం పేద పిల్లలకు కేటాయించాలి. కానీ రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు విద్యాహక్కు చట్టాన్ని పట్టించుకున్న దాఖలా లేదు. వీటిపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ కనిపించడంలేదు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని... ఈ విద్యా సంవత్సరం నుంచే ఫీజు నియంత్రణ చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు కోరుతున్నారు.

ఎం. సోమేశ్వరరావు

# బెస్ట్ లివింగ్ సిటీగా హైదరాబాద్: రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తాం. అలాగే రీజనల్ రింగ్ రోడ్ అవతల అగ్రి ఎకానమీని డెవలప్ చేస్తున్నాం" అని రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదిని కూడా పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి తీరుతామని పునరుద్ఘాటించారు. దేశంలోని ఇతర మెట్రో నగరాల పరిస్థితులను ఉదాహరిస్తూ ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం కారణంగా స్కూళ్లకు, ఆఫీసులకు సెలవుల ఇవ్వాల్సిన దుస్థితి వచ్చిందని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడం వల్ల అక్కడ ఇలాంటి సమస్యలు వచ్చాయని గుర్తుచేశారు. బెంగళూరులో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య, చెన్నైలో నీటి కొరత వంటి అనేక ఇబ్బందులు ఉన్నాయని.. వాటన్నింటి నుంచి పాఠాలు నేర్చుకుని భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా హైదరాబాద్‌ను డెవలప్ చేస్తున్నామని చెప్పారు. ప్రకృతి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే దేశంలోని కొన్ని నగరాల్లో ఆర్టిఫిషియల్ ఆక్సిజన్ తయారు చేసుకోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత కోసం స్కిల్ యూనివర్సిటీ.. భూములిచ్చిన ప్రజలకు ధన్యవాదాలు రాష్ట్రంలో కేవలం పరిశ్రమలు తీసుకురావడమే కాకుండా, వాటిలో స్థానిక యువతకు ఉద్యోగాలు వచ్చేలా నైపుణ్యాభివృద్ధి కోసం 'స్కిల్ యూనివర్సిటీ'ని నెలకొల్పుతున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కాలేజీల నుంచి బయటకు వచ్చే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించేలా ప్రయత్నాలు ముమ్మరం చేశామన్నారు. సీతారాంపూర్లో పరిశ్రమల స్థాపనకు సహకరించిన స్థానిక ప్రజలకు ఈ సందర్భంగా సీఎం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సీతారాంపురం ప్రజల త్యాగాల వల్లే ఇక్కడ ఈ రోజు ఇంత పెద్ద పరిశ్రమ ఏర్పాటు అయింది. గతంలోనూ రంగారెడ్డి జిల్లా ప్రజలు చేసిన భూ త్యాగాల వల్లే ఔటర్ రింగ్ రోడ్, పెద్ద పెద్ద పరిశ్రమలు వచ్చాయి. ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# మనవడి కోసం పూరీలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి..

## ముద్దు ముద్దు మాటలకు మురిసిపోయిన సీఎం

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:

పరిపాలన, రాజకీయ వ్యవహారాలతో నిత్యం బిజీగా ఉండే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కాసేపు తన మనవడి కోసం గరిటె పట్టారు. "తాతా.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా" అని మనవడు ముద్దు ముద్దుగా అడగడంతో మనవడి కోసం కిచెన్‌లోకి ఎంట్రీ ఇచ్చి స్వయంగా షెఫ్‌గా మారిపోయారు. మనవడి కోసం తాను పూరీలు చేస్తున్న మధుర క్షణాలకు సంబంధించిన వీడియోను గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఎమోషనల్ క్యాప్షన్ రాసుకొచ్చారు: "'తాత.. నువ్వు పూరీలు వేస్తేనే తింటా' అని మనవడు అడిగితే తప్పుతుందా? పక్కన మనవడు, చేతిలో పిడికెడు పిండి, దోసిట్లో నవ్వులు, గుండ్రంగా లేని డజన్ పూరీలు... బిజీ బిజీగా సాగుతున్న ప్రజా జీవితంలో.. మనవడితో కలిసి పూరీలు వేస్తూ గడిపిన ఈ కొన్ని క్షణాలు, మధుర జ్ఞాపకాలు" అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**క్యూట్ వీడియో వైరల్:**

ఈ క్యూట్ వీడియో సోషల్ మీడియాలో షేర్ చేసిన కొద్దిసేపటికే విపరీతంగా వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినా.. మనవడికి మాత్రం తాతేనని, నిత్యం ప్రజాసేవలో అలసిపోయే మీకు ఇలాంటి చిన్న చిన్న సంతోషాలు తీపి గుర్తులు అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. కాగా, రేవంత్ రెడ్డి ఏకైక కుమార్తె నైమిషా



రెడ్డి కుమారుడు అంటే రేవంత్ రెడ్డికి ఎప్పుడూ స్పెషలే. తన మనవడికి వారి అమ్మానాన్న రేయాన్స్ అని పేరు పెట్టుకుంటే రేవంత్ రెడ్డి మాత్రం స్పెషల్‌గా రుద్రదేవ్ పెట్టుకున్నాడు. తాను తన స్వగ్రామానికి వెళ్లినా, దైవదర్శనాలకు వెళ్లినా తనతో పాటు తన మనవడిని రేవంత్ రెడ్డి వెంట తీసుకుని వెళ్తారు. ఆ సమయంలో తన మనువడిని ఎత్తుకుని అతడితోనే సమయం గడిపేందుకు ప్రయత్నం చేస్తుంటారు. ఇటీవలే తన మనువడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రంలో అక్షరాభ్యాసం కూడా చేయించారు. ఇప్పుడు ఏకంగా పూరీలు కావాలని అడగడమే ఆలస్యం రేవంత్ రెడ్డి కిచెన్ రూమ్‌లోకి ఎంట్రీ ఇవ్వడం అక్కడ తన మనువడి ముద్దు ముద్దు మాటలకు మురిసిపోవడం అందరిని ఆకట్టుకుంటోంది.

# బీబీనగర్ ఎయిమ్స్ దేశంలోనే అత్యుత్తమ వైద్య కేంద్రంగా ఎదుగుతుంది: కేంద్ర మంత్రి జేపీ నడ్డా



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. గురువారం బీబీనగర్ ఎయిమ్స్‌లో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిషన్ రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, లక్ష్మణ్, ఎయిమ్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రులు బీబీనగర్ ఎయిమ్స్‌లోని అన్ని భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. బీబీనగర్ ఎయిమ్స్‌ను దేశంలోనే అత్యుత్తమ'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని జేపీ నడ్డా పేర్కొన్నారు. బీబీనగర్ ఎయిమ్స్ నిర్మాణం రూ.1,000 కోట్ల వ్యయంతో కొనసాగుతోందని, ఇప్పటివరకు 87 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రస్తుతం 24 విభాగాలు పనిచేస్తుండగా, ఇప్పటికే రెండు ఎంబీబీఎస్ బ్యాచ్‌లు విద్యాభ్యాసం చేస్తున్నాయని వెల్లడించారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో రోజుకు సుమారు 1,800 మంది ఓపీ రోగులకు వైద్య సేవలు అందుతున్నాయని, అత్యవసర వైద్య సేవలతో పాటు అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. టెలిమెడిసిన్ సేవలను కూడా విజయవంతంగా అందిస్తున్నామని, ఇప్పటికే లక్ష మందికి పైగా ప్రజలు ఈ సేవలను వినియోగించుకున్నారని తెలిపారు. పరిశోధన రంగానికి కేంద్ర ప్రభుత్వం రూ.64 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ప్రస్తుతం 128 పరిశోధన ప్రాజెక్టులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. వెయ్యికి పైగా పరిశోధనా పత్రాలు (పబ్లికేషన్స్) వెలువడటం సంస్థ పురోగతికి నిదర్శనమని అన్నారు. దేశంలో తొలిసారిగా బీబీనగర్ ఎయిమ్స్‌లో కమ్యూనిటీ రేడియో స్టేషన్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. అలాగే 547 వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేశామని వివరించారు. దేశంలో ఎయిమ్స్‌ల అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ, 20వ శతాబ్దంలో ఢిల్లీలో ఒక్క ఎయిమ్స్ మాత్రమే ఉండేదని, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి హయాంలో మరో ఐదు ఎయిమ్స్‌లు ఏర్పాటు చేశారని తెలిపారు. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో 23 కొత్త ఎయిమ్స్‌లకు శ్రీకారం చుట్టిందని, వాటిలో ఇప్పటికే 14 పూర్తి కాగా, మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో పూర్తి స్థాయిలో బోధనా సిబ్బంది అందుబాటులో ఉందని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. గత పదేళ్లలో ఆరోగ్య రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ప్రజలకు అందిస్తున్నామని చెప్పారు. ఢిల్లీ ఎయిమ్స్ ఈ స్థాయికి చేరుకోవడానికి 20 సంవత్సరాలు పట్టిందని, అదే స్థాయి అభివృద్ధిని బీబీనగర్ ఎయిమ్స్ చాలా వేగంగా సాధిస్తోందని జేపీ నడ్డా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఎయిమ్స్ అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

**లోపలికి రావడానికి కార్యకర్తల అత్యుత్సాహం...**

బీబీనగర్ ఎయిమ్స్‌లో కేంద్ర మంత్రి జేపీ నడ్డా పర్యటన సందర్భంగా బీజేపీ కార్యకర్తలు అత్యుత్సాహం ప్రదర్శించారు. మంత్రి నడ్డా లోపలికి వచ్చే సమయంలో కార్యకర్తలు కూడా లోపలికి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకొచ్చారు. అయితే అందరికీ లోపలికి అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడంతో కొంతమంది కార్యకర్తలు తీవ్ర స్థాయిలో అత్యుత్సాహం ప్రదర్శించారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ఈ క్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు కూడా కార్యకర్తల గుంపులో చిక్కుకున్నారు. అయినప్పటికీ కార్యకర్తలు ఒక్కసారిగా లోపలికి చొచ్చుకెళ్లారు. ఈ తోపులాటలో ఇద్దరు గన్‌మెన్‌లు కిందపడగా, అక్కడ ఏర్పాటు చేసిన పూల మొక్కలు ధ్వంసమయ్యాయి. అలాగే లోపల నేలపై ముగ్గుతో అలంకరించడంతో, దానిపై కాలు జారి కొందరు కార్యకర్తలు, మీడియా ప్రతినిధులు కూడా కిందపడ్డారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కార్యకర్తలను అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులు తీవ్రంగా శ్రమించారు.

# ఉద్యోగాలు కావాలంటే క్రీడల్లో రాణించండి..

(మొదటి పేజీ తరువాయి)

యువతకు ఉద్యోగాలు రావాలంటే చదువు ఒక్కటే కాదని, క్రీడల్లో రాణించి, దేశానికి పేరు తీసుకువస్తే కచ్చితంగా ఉద్యోగం వస్తుందన్నారు. క్రీడలపై దృష్టి పెట్టి, క్రీడాకారులుగా రాణించినవారందరికీ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగం ఇస్తుందన్నారు.అనంతరం రాష్ట్రానికి అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చిన పలువురు పారా అథ్లెట్, తెలంగాణ క్రీడాకారులకు సీఎం రేవంత్ రెడ్డి నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. పారా అథ్లెట్ అయిన దీప్తి జీవాంజికి రూ.50 లక్షల బహుమతి అందజేశారు. ధనుష్ శ్రీకాంత్ కు రూ.2.10 కోట్లు, ఈషా సింగ్ కు రూ.3.30 కోట్లు, నిఖత్ జరీన్ కు రూ.60 లక్షలు, తనీష్క్ మురళీధర్ కు రూ.53 లక్షల 60 వేలు, సురభి భరద్వాజ్ కు రూ.10 లక్షల నగదు బహుమతులు అందించారు.

# స్టీల్, సిమెంట్ ధరలు తగ్గించాలి..

(మొదటి పేజీ తరువాయి)

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా వంద శాతం సబ్సిడీతో రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టడం లేదని, ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమైన స్టీల్, సిమెంట్‌ను తక్కువ ధరకే అందించాలని మంత్రులు చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. పరిశ్రమలు, హౌసింగ్ అధికారులు ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో సమన్వయం చేసుకొని లబ్ధిదారునికి ఏ విధంగా మెటీరియల్ చేరవేయాలన్న దానిపై రూట్ మ్యాప్ తయారు చేయాలని మంత్రులు సూచించారు. ఈ సమావేశంలో పరిశ్రమల యాజమాన్యాలతోపాటు హౌసింగ్ సెక్రెటరీ వీపీ గౌతమ్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రెటరీ కృష్ణాదిత్య, టీజీఐఐసీ ఎండీ శశాంక తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు కేసీఆర్‌ను సీఎంగా చూడాలనుకుంటున్నారు..: జోస్యం చెప్పిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రజలంతా కేసీఆర్ ను మరోసారి సీఎంగా చూడాలనుకుంటున్నారని, ఆ విషయాన్ని ప్రజలే స్పష్టంగా చెప్పారన్నారు. సొంత సర్వేలోనే తనకు తీవ్ర ప్రజావ్యతిరేకత రావడాన్ని తట్టుకోలేకనే సీఎం రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పతనం దాదాపు ఖాయమని, ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని, బీజేపీ, మరే ఇతర పార్టీలకు అవకాశం ఇచ్చేందుకు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ జారుడు బండపై నిలబడిందని, ఇప్పుడు తిరిగి పుంజుకునే అవకాశాలు కూడా లేవని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇకపై ప్రజా ఆమోదం పొందడం అత్యంత కష్టమని, ఏం చేసినా మళ్లీ ప్రజల నమ్మకాన్ని పొందలేరన్నారు.

# సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

నిర్భయవార్త ప్రతినిధి :వేములవాడ :





సమాజ సేవేలక్ష్యంగానిరంతరంసేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం వేములవాడ పట్టణంలోని బాలనగర్ ప్రాథమిక పాఠశాల మరియు మహాలక్ష్మి వీధి నాలుగో వార్డ్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడి కేంద్రం విద్యార్థులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చిన్నారులకు నోట్‌బుక్స్, పలకలు, పెన్సిల్లు, పెన్నులు, స్కూల్ బ్యాగులు అందజేసి వారి విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేములవాడ పట్టణ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, కౌన్సిలర్ తోటరాజు, కౌన్సిలర్ కొండ శేఖర్, కోయిల్‌కారి మస్తాన్, గంప మహేష్ హాజరై ట్రస్ట్ నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలను అభినందించారు. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమని వారుపేర్కొన్నారు.ఈకార్యక్రమంలో సాయి రూప చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఏద్దండి రాజు, దూలం భూమేష్ గౌడ్, మల్కాపురం ప్రశాంత్, హరి ప్రసాద్, గొట్టే నవీన్ తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు ఆనందంగా విద్యా సామగ్రిని స్వీకరించగా, ట్రస్ట్ సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడి సిబ్బంది, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో విద్యాభివృద్ధికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని పలువురు కొనియాడారు.

# కాళేశ్వరం పేరుతో అధికారం రుచి చూడాలనే ఆరాటం..

## కేటీఆర్, హరీష్‌రావుకు మంత్రి పొంగులేటి కౌంటర్



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్:

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు అంశం చుట్టూ జరుగుతున్న విమర్శలు ప్రతి విమర్శలు హాట్ టాపిక్ గా మారుతున్నాయి. రైతుల గోడును పట్టించుకోకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం కన్నేపల్లి పంప్ హౌస్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోయడం లేదని ప్రభుత్వానికి చేతకాకపోతే వారం రోజుల పాటు ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగించండి, రైతులకు నీరందిస్తామని కేటీఆర్, తనకు ఓ మూడు నెలలు నీటిపారుదల శాఖను అప్పగిస్తే కాళేశ్వరం అంటే ఏమిటో చూయిస్తానంటూ హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. తాజాగా గురువారం ఎక్స్ వేదికగా స్పందించిన మంత్రి.. దొంగ "తాళం చెవులు కూడా నాకే ఇవ్వండి" అన్నట్టుగా హరీశ్ రావు, కేటీఆర్‌ల కోరిక ఉందన్నారు.

**అధికారం రుచి చూడాలనే ఆరాటం:**

బీఆర్ఎస్ పార్టీపై పట్టుకోసం బావబామ్మర్దుల ఆధిపత్య పోరు ఫామ్‌హౌస్ నుంచి కాళేశ్వరం వరకు చేరిందని బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవన్న విషయం అగ్గిపెట్టె రావు, డ్రామారావులకు అర్థమైనట్టుందిన్నారు. అందుకే ఒకరు 'వారం రోజులు', మరొకరు 'మూడు నెలలు' అంటూ... కనీసం కాళేశ్వరం పేరుతోనైనా కొద్దిరోజులు అధికార రుచి చూడాలనే ఆరాటం కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. హరీష్ రావు గారూ... అధికారంలో ఉన్నప్పుడు ఏమైనా పెండింగ్ కమీషన్లు ఉన్నాయా? వాటి వసూలు కోసమేనా మూడు నెలలు ఇరిగేషన్ మంత్రి బాధ్యత ఇవ్వండి అంటున్నారు.. ఇంత పదవి వ్యామోహమా? అని ప్రశ్నించారు.

# కెసిఆర్ పాలన లో తెలంగాణ సుభిక్షంగా ఉంద

### ప్రజా సమస్యలు గాలికి వదిలి పాలన చేస్తున్న కాంగ్రెస్ సర్కార్.. రాబోయే కాలం లో రాష్టంలో ఎగిరేది గులాబీ జెండా నే. నియోజకవర్గ నాయకులు మానే రామకృష్ణ.




భద్రాచలం జులై 9 నిర్భయ వార్త ప్రతినిధి.భద్రాచలం పట్టణం లో 16 వార్డు బి.ఆర్.ఎస్ పార్టీ సమావేశం కాపుల నవీన్ అధ్యక్షత న జరిగింది. సమావేశం లో ముఖ్య అతిధి గా పాల్గొన్న మానే రామకృష్ణ మాట్లాడుతూ.తెలంగాణ రాష్టం కెసిఆర్ పాలన లో సుభిక్షం గా ఉంది అని అన్నారు.. రాష్టంలో 10 ఏండ్ల పాలనలో స్వర్ణ యుగం గా ఉందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేక చేతులెత్తి పాలన చేస్తున్నది అని అన్నారు....ప్రజా సమస్యలపై గులాబీ జెండా ప్రజలకు ఎప్పుడు అండగా ఉంటుంది అని అన్నారు..ఈ సమావేశంలో మండల పార్టీ నాయకులు ఆకోజు సునీల్ కుమార్,కాపుల సూరిబాబు, పసుపులేటి రమేష్, దానియేలు ప్రదీప్, కొల్లి పాక శివ, రావూరి రవికిరణ్, మహిళా నాయకులు కావూరి సీతమహాలక్ష్మి, ఎండీ ముంతాజ్. నర్సమ్మ, కాపుల సుకన్య తదితరులు పాల్గొన్నారు..

# కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఘన స్వాగతం పలికిన ఏనుగు సుదర్శన్ రెడ్డి

### ఎయిమ్స్‌లో పేదలకు అందుతున్న . నాణ్యమైన వైద్య సేవలు అభినందనీయం

నిర్భయ వార్త ప్రతినిధి. కేంద్ర వైద్య, ఆరోగ్య ఉ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా తెలంగాణ పర్యటనలో భాగంగా ఎయిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు.అనంతరం కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో కలిసి ఎయిమ్స్ ఆసుపత్రిలోని వివిధ విభాగాలను



సందర్శించిన ఏనుగు సుదర్శన్ రెడ్డి, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆధునిక సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోని ప్రతి పేద కుటుంబానికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎయిమ్స్ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తోందన్నారు. కేవలం రూ.10 ఓపీ టికెట్‌తోనే నిపుణులైన వైద్యుల సేవలు, ఆధునిక వైద్య పరీక్షలు, అత్యున్నత స్థాయి చికిత్సలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం కేంద్ర ప్రభుత్వ ప్రజాహిత దృక్పథానికి నిదర్శనమని పేర్కొన్నారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సైతం నాణ్యమైన వైద్యం అందించడంలో ఎయిమ్స్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం “ఆరోగ్యమే మహాభాగ్యం” అనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా వైద్య రంగంలో పలు సంస్కరణలు అమలు చేస్తోందని, ఎయిమ్స్ వంటి అత్యాధునిక వైద్య సంస్థలు ఆ సంకల్పానికి ప్రతీకగా నిలుస్తున్నాయని ఏనుగు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

# నేటి విద్యాసంస్థల బంద్ ను జయప్రదం చేయండి



సింగరేణి జూలై 9 నిర్భయవార్త రిపోర్టర్.విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ూఖీ× )మండల అధ్యక్షుడు చిలుముల భరత్, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (ణీఖీ×) మండల కార్యదర్శి ఆదేర్ల వినయ్ కుమార్ పిలుపునిచ్చారు. బందు జయప్రదం ప్రచారం లో భాగంగా వారు మాట్లాడుతూ అధిక ఫీజులు వసూళ్లు, పాఠశాలలు, కళాశాలలో కేజీ టు పీజీ వరకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన విద్యను అందించాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ స్టైఫండ్, బిల్లులు , కాస్మోటిక్ చార్జెస్, మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా, టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ, 23 వేల పైగా పాఠశాల మూసివేత, కార్పొరేట్ విద్యను అరికట్టాలని, ఎం ఈ ఓ డి ఇ ఓ మరియు లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో అత్యధిక ధరలకు అమ్ముతున్న పుస్తకాలు, యూనిఫామ్ లను సరసమైన ధరలకు అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలి వంటి సమస్యల పరిష్కారానికి జరుగుతున్న పని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు

# భద్రగిరి మార్ట్ లో లభించే ఆర్గానిక్ అటవీ ఉత్పత్తులు అద్భుతం..

### ట్రీఫీడ్ ఏడి ఆరిఫ్ వలి..

భద్రాచలం జూలై 9 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం పట్టణ ప్రజలకు అడవులలో దొరికే అటవీ ఉత్పత్తులు, సేంద్రియ ఆర్గానిక్ ఉత్పత్తులు, ఎస్ హెచ్ జి గిరిజన మహిళలకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఎంతో దూర దృష్టితో భద్రాచలం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ కృషితో ఏర్పాటు చేసిన భద్రగిరి మార్ట్ చాలా అద్భుతంగా ఉందని



ఈ సందర్భంగా పిఓ ను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు ట్రీఫీడ్, కేంద్ర గిరిజన వ్యవహార మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ అదనపు సంచాలకులు సయ్యద్ ఆరిఫ్ వలీ అన్నారు. గురువారం భద్రాచలం పట్టణంలోని భద్రగిరి మార్ట్ ను ట్రీఫీడ్ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన సందర్శించి మార్ట్ లోని అటవీ ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగకరమైన అనేక అటవీ వస్తువులను ఈ మార్ట్ లో అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషకరమని, ఇవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఎస్ హెచ్ జి గిరిజన మహిళలు ఆర్గానిక్ పంటలు పండించే గిరిజన రైతుల ఉత్పత్తులకు విస్తృత మార్కెట్ను కల్పించడంతోపాటు స్థానిక గిరిజన కుటుంబాలకు ఆర్థిక బలాన్ని అందించే సదాశయంతో ఏర్పాటు చేసిన ఈ మార్టు నకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని న్యూఢిల్లీలోని మా కార్యాలయంలో నివేదిక సమర్పించి, భద్రగిరి మార్ట్ లో అందుబాటులో ఉంచిన గిరిజనుల సాంప్రదాయ ఉత్పత్తులు, వారి ప్రతిభకు సరైన గుర్తింపు ఇవ్వడమే కాకుండా వారి జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా ఈ మార్ట్ ఏర్పాటు చేయడం అలాగే భద్రగిరి మార్ట్ లోని ప్రతి నిత్యవసర సరుకుల నాణ్యతను మరియు వినియోగదారులకు అలాగే కొనుగోలుదారులకు అందిస్తున్న రేట్లను పరిశీలించామని అన్నారు.భద్రగిరి మార్టును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ అధికారులు.భద్రాచలం పట్టణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భద్రగిరి మార్టును ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్ సందర్శించి మార్ట్ లోని నిత్యవసర సరుకుల నిలువ స్టాకును పరిశీలించి



రికార్డులతో సరి చూసి స్టాక్ నిర్వహణ వస్తువుల నిలువ అమ్మకాలు జరిపిన అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు ఇస్తూ భద్రగిరి మార్ట్ లో డిమాండ్ ను బట్టి అయిపోయిన వస్తువులను వెంటనే మార్టులో పొందుపరచాలని స్టాక్ రిజిస్టర్లు ఎప్పటికప్పుడు నవీకరించి తప్పులు లేకుండా నిర్వహించాలని, నిత్యవసర సరుకులు సరఫరా చేసే ఏజెన్సీలకు వారికి సంబంధించిన పైకం సమయానుకూలంగా అందించాలని కొనుగోలు దారుల నుండి భద్రగిరి మార్టులోని నిత్యవసర సరుకుల గురించి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం భద్రాచలం పట్టణంలోని మిక్కీ పచ్చళ్ళు తయారు చేసే కేంద్రాన్ని సందర్శించి పచ్చళ్ళు తయారీ విధానాన్ని వాడుతున్న ముడి సరుకులను పరిశీలించి ఎటువంటి కల్తీ లేకుండా నాణ్యతగా ఉండే పచ్చళ్ళు తయారు చేసి భద్రగిరి మార్ట్ కు సరఫరా చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో కేంద్ర గిరిజన వ్యవహార మంత్రిత్వ శాఖ సభ్యులు నేహా శర్మ, మన్ సిమ్రాన్ కౌర్, ఐటిడిఏ మేనేజర్ ఆదినారాయణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం రైతు ఆశీర్వాద సభ: ఏజెన్సీ ఎస్సీ రైతుల సమస్యలపై రేవంత్ రెడ్డి దృష్టి పెట్టాలి

### హక్కు పత్రాలు లేక పెట్టుబడి సాయం అందడం లేదు: కెవిపిఎస్ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ డిమాండ్

కొత్తగూడెం, జూలై 10 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో జరగబోయే 'రైతు ఆశీర్వాద సభ'కు విచ్చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి.. తరతరాలుగా ఏజెన్సీ ప్రాంతాల్లో సాగు చేసుకుంటున్న దళిత (ఎస్సీ) రైతుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి (కెవిపిఎస్) జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం కొత్తగూడెం సింగరేణి ఏరియా హాస్పిటల్ సెంటర్ నుండి ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ సందర్భంగా బొమ్మెర శ్రీనివాస్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లోని ఎస్సీ రైతులకు భూములున్నా.. సరైన హక్కు



పత్రాలు (పట్టాలు) లేకపోవడం వల్ల ఎరువులు, విత్తనాలు మరియు వ్యవసాయ పెట్టుబడి సాయం పొందలేక నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.”గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏజెన్సీ ప్రాంత ఎస్సీ రైతులకు సంబంధించిన మ్యానువల్ పహానీలను ఆన్‌లైన్ నుండి తొలగించారు. దీనివల్ల దళిత రైతులు దిక్కుతోచని దీనస్థితిలోకి నెట్టివేయబడ్డారు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా ఏజెన్సీ ప్రాంత ఎస్సీల బతుకులు మాత్రం మారడం లేదు. ఇది రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాయడమే.”

**వైఎస్సార్ తెచ్చిన అటవీ చట్టం ద్వారా న్యాయం చేయాలి..**

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి హయాంలో ప్రవేశపెట్టిన '2006 అటవీ హక్కుల చట్టం' ఆధారంగా.. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ రైతులకు తక్షణమే భూ హక్కు పత్రాలు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ 'ప్రజా పాలన' ప్రభుత్వం దళిత రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు.

# విద్యార్థులు ప్రతిరోజూ వార్తాపత్రిక చదివే అలవాటు పెంచుకోవాలి: కలెక్టర్

### కౌకూర్ జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసిన జిల్లా కలెక్టర్

అల్వాల్ జూలై 09 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మేడ్చల్ జిల్లా అల్వాల్ మండలంలోని కౌకూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ గురువారం సందర్శించి విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా వి ద్యార్థులతో మమేకమైన కలెక్టర్ పలు అంశాలపై వారికి సూచనలు చేశారు. విద్యార్థులు ప్రతిరోజూ తమ దినచర్యలో భాగంగా వార్తాపత్రిక చదివే అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు. అలాగే స్టేజ్





ఫియర్‌ను అధిగమించి, తమకు సౌకర్యంగా ఉన్న భాషలోనే వేదికపై ధైర్యంగా మాట్లాడాలని, తద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని తెలిపారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందుబాటులో ఉన్న సౌకర్యాలపై హెడ్‌మాస్టర్ మురళీకృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అదనపు తరగతి గదులు అవసరమని హెడ్‌మాస్టర్ వివరించగా, టాయిలెట్లు, తరగతి గదులు తదితర మౌలిక వసతులకు సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థులు కోరిన క్రీడా సామగ్రిని అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, అల్వాల్ తహసీల్దార్ రాములు, హెడ్‌మాస్టర్ మురళీకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# దుమ్ముగూడెం మండల ఎస్సీ సేల్స్ అధ్యక్షుడిగా కె రవి నియామకం

దుమ్ముగూడెం జులై 9 నిర్భయ వార్త ప్రతినిధి.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దుమ్ముగూడెం మండలందుమ్ముగూడెం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కుషిని రవి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది.నియామకం అనంతరం కుషిని రవి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవి ప్రసన్న కి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు గద్దల రమేష్ కి, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోదెం వీరయ్య కి, భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కి, దుమ్ముగూడెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు తెల్లం హరికృష్ణ కి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని, ఎస్సీ వర్గాల సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కుషిని రవికి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పార్టీ నాయకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# అతి త్వరగా కరకట్ట పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేసిన భద్రాచలం బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇమంది నాగేశ్వరరావు.



భద్రాచలం జూలై 9 నిర్భయ వార్త ప్రతినిధి.భద్రాచలంలో జూలై నెల వచ్చింది అంటే గోదావరి ఉగ్రరూపం దాల్చుతుంది లోతట్టు ప్రాంత ప్రజలు భయాందోళనకు గురి అవుతారు. దానికోసం నూతన కరకట్ట పనులు 2023 వ సంవత్సరం అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించారు. కానీ మూడు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. ముఖ్యంగా నేషనల్ హైవే రోడ్డు వద్ద బిట్టు అసంపూర్తిగా మిగిలిపోయి ఉంది. కావున దయచేసి నేషనల్ హైవే అధికారులు తెలంగాణ ప్రభుత్వం సమన్వయం ఏర్పాటు చేసుకొని ఈ కరకట్ట పనులు పూర్తి చేయాలి అని కోరుకుంటున్నాము..

# కస్తూరిబా విద్యార్థులకు ప్రశంస పత్రాలు.

సింగరేణి జూలై 9 నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి కస్తూర్బా విద్యార్థులు అత్యధిక హాజరు శాతం కలిగి ఉండడంతో వారికి స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఎస్పీడీ) ప్రశంస పత్రాలను అందజేసినట్లు విద్యాలయ స్పెషలాఫీసర్



ఝాన్సీ సౌజన్య తెలిపారు. కస్తూర్బా విద్యాలయాల్లో ఎఫ్ఆర్ఎస్( పేస్ ఇకగ్నైజేషన్ సిస్టం) హాజరును అమలు చేస్తున్నారు. కారేపల్లి కస్తూర్బా విద్యార్థులు 90 శాతం హాజరు కలిగి ఉండడంతో వారికి ఎస్పీడీ ప్రశంస పత్రాలు పంపినట్లు విద్యాలయ ఎస్ఓ తెలిపారు. ఖమ్మం జిల్లాలో 14 కస్తూర్బా విద్యాలయాలు ఉండగా కారేపల్లి కస్తూర్బా విద్యాలయం కు అధిక సంఖ్యలో ప్రశంస పత్రాలు వచ్చినట్లు స్పెషలాఫీసర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులను ఆమె అభినందించారు

# బాధిత కుటుంబాలను మనీషాలక్ష్మి పరామర్శ.

సింగరేణి జూలై 9 నిర్భయవార్త రిపోర్టర్. బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోత్ మనీషా లక్ష్మి గురువారం సింగరేణి మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలో పలువురు బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన మాదారం గ్రామ ఉపసర్పంచ్ బానోత్ లాలు, పేరుపల్లి గ్రామానికి చెందిన బుడిగ శ్రీను, పాత కమలాపురం సర్పంచ్ దివంగత తేజవత్ బాబురావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. మనీషా లక్ష్మి వెంట మాజీ జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్, మాజీ దిశ కమిటీ సభ్యులు లకావత్ లక్ష్మణ్, జిల్లా మైనార్టీ నాయకులు ఎస్కే గౌసుద్దీన్, జిల్లా నాయకులు డొంకెన రవీందర్ , పేర్ని వెంకటేశ్వర్లు, యువజన నాయకులు జడల కళ్యాణ్, రామారావు, హరీష్, గంగారబోయిన మురళి, పిల్లలమర్రి వెంకటేష్, మధు,పెద్దబోయిన సురేష్, సంపత్ తదితరులు పాల్గొన్నారు



# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

## 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

## 150 స్టాల్స్ ఏర్పాటు అంచనాలకు మించి 11 వేల మంది రైతుల హాజరు

## మెగా రైతు మేళాలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

చింతకాని, జూలై 09 నిర్భయవార్త రిపోర్టర్.రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. చింతకాని మండలం జగన్నాధపురం గ్రామంలో గురువారం నిర్వహించిన మెగా రైతు మేళాకు రైతులు విశేషంగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి పాల్గొన్నారు.



ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ మంత్రివర్గం రైతుల అవసరాలు, వ్యవసాయ రంగ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట కొనుగోలు వరకు ప్రతి దశలో రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని తెలిపారు. రైతు సంక్షేమంపై ప్రతిపక్షాలు అనవసర విమర్శలు చేస్తున్నాయని, తమ ప్రభుత్వం మాటలకు పరిమితం కాకుండా చేతల్లో చూపించే ప్రభుత్వమని అన్నారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, కడెం వంటి సాగునీటి ప్రాజెక్టులు నేటికీ రైతులకు నీరందిస్తున్నాయని, గత ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగిపోవడం ఆ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు. ఖమ్మం జిల్లాలో ప్రతి కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉందని, అందుకే ఇక్కడ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు.ప్రభుత్వానికి అనేక సమస్యలు ఉన్నప్పటికీ ధాన్యం, మొక్కజొన్న తదితర పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేశామని తెలిపారు. వ్యవసాయ ఆధునికీకరణ కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని, ఖమ్మం నుంచి ఆదిలాబాద్ వరకు ప్రతి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తున్నామని తెలిపారు. రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రత్యామ్నాయ పంటలపై శాస్త్రవేత్తలతో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి సహా తెలంగాణ మంత్రివర్గం మొత్తం హాజరవుతుందని అన్నారు.ప్రస్తుతం రైతులకు అందుతున్న ప్రతి నీటి చుక్క కాంగ్రెస్ ప్రభుత్వాలు నిర్మించిన సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే వస్తోందని తెలిపారు. రైతులను మాయమాటలతో మోసం చేసే పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వబోరని అన్నారు.రైతు సంక్షేమానికి పునాదులు వేసిన ప్రభుత్వాలను రైతులే కాపాడుకుంటారని, ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్న అబద్ధాలను ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. చింతకాని మండలంలో మూడు లక్షల మంది రైతులతో భారీ రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తున్నామని తెలిపారు.వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులకు అందించాలనే లక్ష్యంతో స్టాల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతుల అభివృద్ధికి అవసరమైన ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతుందని, శాస్త్రవేత్తలు చెప్పే అంశాలను రైతులు శ్రద్ధగా విని గ్రామాలకు తీసుకెళ్లాలని కోరారు. ఆధునిక సాగు పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయంతో పాటు ఫిషరీస్, హార్టికల్చర్ తదితర అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం తెలిపారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో జూన్ 30న నిర్వహించాల్సిన రైతు ఆశీర్వాద సభ వర్షాల కారణంగా జూలై 10వ తేదీకి వాయిదా పడిందన్నారు. తెలంగాణ చరిత్రలోనే అతిపెద్ద రైతు సభను చింతకాని మండలంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సకాలంలో కురవడం లేదని, ఈ ఏడాది నీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు ఎలా వ్యవసాయం చేయాలనే అంశాలపై వ్యవసాయ శాఖ శాస్త్రీయ సూచనలు అందిస్తోందన్నారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వైరా ప్రాజెక్టుకు గోదావరి జలాలు అందించాలని చేసిన విజ్ఞప్తికి డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకాన్ని వినియోగించుకుంటూ రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలిస్తున్నామని, దీంతో వర్షాలతో సంబంధం లేకుండా దాదాపు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు.

తక్కువ కాలంలో, తక్కువ నీటితో పండే పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నను కొనుగోలు చేయలేదని, రైతులు నష్టపోకుండా ఉండేందుకు డిప్యూటీ సీఎం రూ.5 వేల కోట్లు కేటాయించి మద్దతు ధరకు మొక్కజొన్న కొనుగోలు చేశారని తెలిపారు. మొక్కజొన్నతో పాటు జొన్న, సోయా తదితర పంటలను కూడా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనన్నారు. మొక్కజొన్న విక్రయించిన రైతుల ఖాతాల్లో మద్దతు ధర చెల్లింపులు రేపటిలోగా జమ చేస్తామని స్పష్టం చేశారు. జూలై 10న జరిగే రైతు ఆశీర్వాద సభ చారిత్రక ఘట్టమని, రైతులకు అవసరమైన ప్రతి సహాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనే రైతు ఆశీర్వాద సభకు లక్షలాది మంది రైతులు హాజరై విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఉద్యమాలు, పోరాటాలు, వ్యవసాయ రంగంలో ఖమ్మం జిల్లాకు ఘన చరిత్ర ఉందని, జిల్లాలో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందన్నారు. సంప్రదాయ పంటలతోపాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని, అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు.సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల ద్వారా వచ్చే వేతనం కంటే ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం, ప్రకృతి సహకరించక పోయినా రైతు సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. రైతులకు అవసరమైన యూరియాను కేంద్ర ప్రభుత్వంతో చర్చించి సమకూరుస్తున్నామని, యూరియా యాప్ ద్వారా అవసరమైన మేరకే కొనుగోలు చేయాలని సూచించారు. యూరియా యాప్ వల్ల దుర్వినియోగానికి అవకాశం లేకుండా పోయిందన్నారు.రైతులకు వాతావరణ పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రపంచంలో ఉన్న అత్యాధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మెగా రైతు మేళా, రైతు ఆశీర్వాద సభ నిర్వహణకు అద్భుతమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం, అధికారులు, సిబ్బందిని మంత్రి అభినందించారు.వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను రైతులకు వివరించేందుకు ఈ మెగా రైతు మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదర్శ రైతులు అనుసరిస్తున్న వ్యవసాయ విధానాలను ఇతర రైతులకు పరిచయం చేయడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.

పంట మార్పిడి విధానం అమలు చేయడం, ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మెగా రైతు మేళా కోసం మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు హార్టికల్చర్, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.మెగా రైతు మేళాకు 5 వేల మంది రైతులు వస్తారని అంచనా వేయగా దాదాపు 11 వేల మంది రైతులు హాజరయ్యారని తెలిపారు. రైతుల కోసం ఆధునిక వ్యవసాయ యంత్రాలు, సాంకేతిక పరికరాలను ప్రదర్శనకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు ఎలా సాధించాలి, ఆధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఎలా వినియోగించు కోవాలి అనే అంశాలపై శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పిస్తారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్నారని, 'రైతు ఆశీర్వాదం' పేరుతో మూడు లక్షల మంది రైతులతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొంటూ, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సర్వే 'సరే'... మరి హద్దులేవీ?

**రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యంతో 'దొంతికుంట' వినాశనం!**
**అభివృద్ధి పేరుతో 5 ఎకరాలు మాయం.. అన్నదాతల గుండెల్లో రైళ్లు!**

అశ్వారావుపేట జులై 10 ( నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)అశ్వారావుపేట పట్టణానికి తలమానికంగా, వందలాది ఎకరాల సాగుభూములకు కల్పవృక్షంగా నిలిచిన పురాతన 'దొంతికుంట చెరువు' అధికారుల ఉదాసీనత, కబ్జాదారుల ఆశ్రిత పక్షపాతానికి బలైపోతోంది. పేరుకేమో సర్వేలు.. చేతల్లోనేమో శూన్యం అన్నట్లుగా తయారైంది ఇక్కడి పరిస్థితి. సర్వే ప్రక్రియ ముగిసిందని చెప్తున్న అధికారులు, ఇప్పటివరకు చెరువుకు శాశ్వత హద్దులు (దీశీబఅఋతీఅవం) నిర్మించకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని అటు రైతులు, ఇటు స్థానిక ప్రజలు నిలదీస్తున్నారు.



**నిధుల జాతర.. చెరువుకు మాత్రం చేటు!**

చెరువును సుందరీకరిస్తాం, అభివృద్ధి చేస్తాం అంటూ 5 కోట్ల రూపాయల నిధులు కుమ్మరిస్తున్నామని చెప్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో మాత్రం చెరువు గొంతు కోస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 5 ఎకరాలు కుంచించుకుపోయింది, అభివృద్ధి పనుల ముసుగులో చెరువు వైశాల్యాన్ని సుమారు గా 5 ఎకరాల వరకు కుదించివేస్తున్నారని, దీనివల్ల చెరువు పూర్తిగా కుంచించుకుపోతోందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారా? సర్వే చేసినా శాశ్వత సరిహద్దు రాళ్లు లేదా ఫెన్సింగ్ ఏర్పాటు చేయకపోవడం వల్ల, కబ్జాదారులకు మేలు చేయడానికే అధికారులు ఈ విధమైన నాన్చుడు ధోరణి అవలంబిస్తున్నారనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల 'సమన్వయ' నిర్లక్ష్యం!

చెరువును సంరక్షించాల్సిన ఇరిగేషన్ (నీటి పారుదల) శాఖ, భూముల సరిహద్దులు తేల్చాల్సిన రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ కాలయాపన చేయడం వల్ల దొంతికుంట చెరువు ఉనికికే ప్రమాదం ఏర్పడింది."చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గితే మా పంట పొలాలకు నీరందే మార్గం మూసుకుపోతుంది. కోట్ల నిధులతో చేసే కాంక్రీట్ కట్టడాలు కాదు మాకు కావాల్సింది, మా చెరువు మాకు కావాలి" అని ఆయకట్టు రైతులుడ పట్టణ ప్రజలు ఆక్రోశిస్తున్నారు.వెంటనే శాశ్వత హద్దుల నిర్మాణం, సర్వే వివరాల ప్రకారం తక్షణమే చెరువు చుట్టూ శాశ్వత హద్దు లేదా సిమెంట్ స్తంభాలను నిర్మించాలి.అసలు చెరువు ఇరిగేషన్, రెవెన్యూ శాఖ వారి లెక్కల ప్రకారం చెరువు లేకపోవడంతో కబ్జాకుగురవుతున్న చెరువుని కాపాడాలని, చెరువు ఆక్రమణ అధికారుల కూడా సహాయం చేస్తున్నారని దీనిపై ?మాయమైన చెరువుపై విచారణ జరిపించి, అభివృద్ధి పేరుతో మాయవుతున్న భూమిని తిరిగి స్వాధీనం చేసుకుని, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి.రైతుల ప్రయోజనాలే ముఖ్యం, కాంట్రాక్టర్ల లాభాల కోసం కాకుండా, రైతులకు సాగునీటి కాలువలు, సాగునీరు అందించేలా చెరువు పూర్వ వైభవాన్నితేవాలని రైతులు పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.




# గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

**జిపిడిపి శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు డా. తెల్లం వెంకట్రావు , పాయం వెంకటేశ్వర్లు**

భద్రాచలం జూలై 9 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం, వీరభద్ర ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీల సమగ్ర అభివృద్ధి కోసం గ్రామ స్థాయి అవసరాలను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో సమర్థవంతమైన ప్రణాళికలను రూపొందించాలని భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు అన్నారు.గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (ౡణూ) రూపకల్పనపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, వైద్యం, రహదారులు, ఉపాధి కల్పన వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.




# అందుబాటు ధరల్లో వైద్య పరీక్షలు అభినందనీయుు

**– మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డ**
**రాంపల్లిలో.. పీపుల్స్ వెల్ఫేర్ డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభం**

నాగారం జూలై 09 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య నిర్ధారణ సేవలు అందించడం అభినందనీయమని నాగారం మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి ఎక్స్‌రోడ్ వద్ద పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'పీపుల్స్ వెల్ఫేర్ డయాగ్నస్టిక్ సెంటర్'ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతికతతో కూడిన వైద్య పరీక్షలు, ఆరోగ్య తనిఖీ ప్యాకేజీలు, ఇంటి వద్దే శాంపిల్స్ సేకరణ వంటి సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వ్యాధులను ముందస్తుగా గుర్తించడంలో డయాగ్నస్టిక్ కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్నారు.పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యుడు జె.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్య పరీక్షలు అందించాలనే లక్ష్యంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే ట్రస్ట్ ప్రధాన లక్ష్యమని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజలు కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ గాంధీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు సత్యం సాగర్, కృష్ణరెడ్డి, సాయి, గోపి, జి.వెంకటేశ్వరరావు, బివి.సత్యనారాయణ, ఆనంద్, ఎం.శ్రీనివాస్, ఎం.ఎల్.చౌదరి, నాగరాజు, శేషగిరి రావు, శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## న్యూ నవీన్ హెయిర్ కటింగ్ సెలూన్ ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు..



భద్రాచలం జూలై 9 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ అవుట్ గేట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ నవీన్ హెయిర్ కటింగ్ సెలూన్, జెంట్స్ బ్యూటీ పార్లర్, బాడీ మసాజ్ ఉ టాటూ సెంటర్ను భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, యువ పారిశ్రామికవేత్తలు స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. నూతన వ్యాపార సంస్థ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వ్యాపారవేత్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు మరియు సెలూన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

## తిమ్మకచెరువును విహార కేంద్రంగా తీర్చిదిద్దుతాం జిఎంఆర్



జులై 9 నిర్భయవార్త, జిల్లా ప్రతినిధి: పటన్ చెరువు తిమ్మకచెరువును రూ4.45 కోట్లతో సుందరీకరిస్తున్నట్లు పటాన్ చేరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి గురువారం నాడు తెలిపారు హైదరాబాద్ మున్సిపల్ డెవలప్మెంట్ అత్తారింటి సి ఎస్ ఆర్ నిధులతో వాకింగ్ ట్రాక్, బతుకమ్మ ఘాట్, ఓపెన్ జిమ్, హరితవనం,చిన్నారుల ఆటస్థలం,రక్షణ కంచే వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు పనులు పూర్తయితే తిమ్మకచెరువు ప్రజలకు ఆహ్లాదకర విహార పర్యట కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు.

## ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలి ఎం.పీ

జులై 9 నిర్భయవార్త, జిల్లా ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో నూతనంగా ప్రారంభమైన ఈఎస్ఐ డిస్పెన్సరీ ద్వారా వేలాదిమంది కార్మికులకు, ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెత్కర్ హర్షం వ్యక్తం చేశారు రాబోయే రోజుల్లో జహీరాబాద్ నారాయణఖేడ్ ప్రాంతాల్లో కూడా ఈఎస్ఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



## జర్నలిస్టులకు డబల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించాలి ఎంపీ మంత్రి




జులై 9 నిర్భయవార్త, జిల్లా ప్రతినిధి: సంగారెడ్డిలో తెలంగాణ రాష్ట్ర యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా మహాసభను గురువారం ఉదయం ఘనంగా నిర్వహించారు! ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు మరియు తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ముఖ్య అతిథిగా హాజరై సంగారెడ్డి లోని టిఎన్జీవో భవన్లో నిర్వహించిన మహాసభలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇరువురు మాట్లాడుతూ రాజ్యాంగానికి ఫోర్త్ పిల్లర్లుగా ఉన్న జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇల్లు, ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కోరారు, అలాగే జర్నలిస్టులకు విషయ పరిజ్ఞానం అవసరమని, జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా వారు కొనియాడారు.

## మెడ్చల్--మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్‌వోగా డా. కె. ఆనంద్ బాధ్యతల స్వీకరణ

**ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యం: డా. కె. ఆనంద్**





మేడ్చల్--మల్కాజిగిరి కలెక్టరేట్, జూలై 9 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: మెద్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా (డీఎంహెచ్‌వో) డా. కె. ఆనంద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం జూలై 8న జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నెం.293 ఉత్తర్వుల మేరకు ఈ నియామకం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డా. కె. ఆనంద్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, ఐఏఎస్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్, విజయేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య, ఆరోగ్య సేవలు అందించడమే తన ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజారోగ్య కార్యక్రమాలు, జాతీయ ఆరోగ్య పథకాలు, మాతా--శిశు సంక్షేమ సేవలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. డా. కె. ఆనంద్ గతంలో మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా, మెద్చల్ సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా, జిల్లా మాతా--శిశు సంక్షేమ కార్యక్రమం, నేషనల్ హెల్త్ మిషన్‌లో కీలక బాధ్యతలు నిర్వహించి ప్రజారోగ్య రంగంలో విశేష అనుభవాన్ని సొంతం చేసుకున్నారు.



## జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పరిశీలన

జులై 9 నిర్భయవార్త, జిల్లా ప్రతినిధి: అమిత్ నారాయణ్, జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి జోన్, డిప్యూటీ కమిషనర్, అమీన్‌పూర్ సర్కిల్-47 మరియు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి అమీన్‌పూర్ సర్కిల్ పరిధిలో కొనసాగుతున అభివృద్ధి పనులు మరియు రహదారి మౌలిక సదుపాయాలపై క్షేత్ర స్థాయి పరిశీలన నిర్వహించారు.



1 ఆర్‌సి పురం మాంస మార్కెట్ పరిశీలనఆర్‌సి పురం మాంస మార్కెట్ ను జోనల్ కమిషనర్ పరిశీలించారు. పారిశుద్ధ్య పరిస్థితులు మురుగు నీటి నిర్వహణ మరియు ప్రజా ఆరోగ్య ప్రమాణాల అమలును సమీక్షించారు. శుభ్రత, వ్యర్థాల తొలగింపు మరియు మౌలిక వసతుల మెరుగుదలపై సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. 2 మోడల్ రోడ్ అభివృద్ధి పనుల సమీక్షప్రతిపాదిత మోడల్ రోడ్ పనుల పురోగతిని పరిశీలించారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు ఆదేశించారు. 3 ఎన్ఎస్ఎల్ రోడ్ పరిశీలనఎన్ఎస్ఎల్ రోడ్ మరియు అనుబంధ రహదారుల పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్ సౌలభ్యం మరియు ప్రజల సౌకర్యార్థం అవసరమైన మెరుగుదలలపై చర్చించారు. 4 రోడ్ పునరుద్ధరణ పనుల పరిశీలనదెబ్బతిన రహదారి భాగాలు మరియు పునరుద్ధరణ పనులను పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. గుంతలు,పాట్ హోల్స్ పూడ్చే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 5 కార్యాలయ నిర్వహణ మరియు సిబ్బంది సమీక్షకార్యాలయ నిర్వహణ మరియు సిబ్బంది పనితీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల త్వరిత పరిష్కారం మరియు సమర్థవంతమైన క్షేత్ర స్థాయి పర్యవేక్షణపై జోనల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించారు. 6 ప్రజా సౌకర్యాలు మరియు మౌలిక వసతుల అభివృద్ధిపౌర మౌలిక వసతులు, రహదారి అనుసంధానం మరియు ప్రయాణికుల భద్రత మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గుర్తించిన లోపాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. 7 పారిశుద్ధ్య వాహనాల పనితీరు మరియు నిర్వహణజేసీబీలు, ట్రాక్టర్లు మరియు జెట్టింగ్ మెషీన్ల పనితీరు పరిస్థితిని సమీక్షించారు. వాహనాల సరైన నిర్వహణ మెయింటెనెన్స్ చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరిశీలనలో అధికారులు తదిరులు పాల్గొనారు

## మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్ ఎస్పీ

ములుగు జూలై 9 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి)రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి





సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దానసరి సీతక్క వారికి జన్మదినం సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు , ఎస్ పి సుధీర్ రామ్నాథ్ కేకన్ మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, డిఎస్పి రవీందర్, సిఐ లు తదితరులు. పాల్గొన్నారు.



## విజయవాడ భవానిపురం పరిధిలోని ఐరన్ యార్డ్ లో లైసెన్స్ లేని ఆటో డ్రైవర్లు మరియు మినీ వ్యాన్లు.



విజయవాడ,నిర్భయవార్త జిల్లా ప్రతినిధి:. నిర్లక్ష్యంగా అతివేగంగా ఆటోల నడుపుతూ అనేక సందర్భాలలో అతివేగంగా నడుపుతూ ఎదురుగా వచ్చే వాహనాలను సైతం లెక్క చేయకుండా యాక్సిడెంట్లకు పాల్పడుతూ ఎవరైనా అడిగితే ఎదురు దాడికి దిగుతూ లైసెన్స్ లేకుండా యాక్సిడెంట్లకు పాల్పడి పారిపోతున్నారు ఐరన్ యార్డు లో ఉన్నటువంటి ప్రతి షాపులో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వారి ఆగడాలు ఆగటం లేదు లైసెన్సు లేకుండా ఆకతాయిగా డ్రైవింగ్ చేస్తూ ఐరన్ యార్డు లోపల తిరిగే వాహనాలను గుద్దుతూ వారు ప్రాణాలతో చెలగాటలాడుతూ నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు భవానిపురం యార్డ్ లోపల పోలీసుల గస్తీ లేకపోవడంతో లేకపోవడంతో ప్రతిరోజు యాక్సిడెంట్ జరుగుతూనే ఉన్నది కావున లైసెన్సులు లేకుండా అతివేగంగా నడిపే ఆటోలు డీసీఎం నడిపే డ్రైవర్ల పై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తున్నారా...?

గుంటూరు, నిర్భయవార్త జిల్లా ప్రతినిధి:గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి ప్రాంగణంలో సగం వరకు కూల్చివేసి అలాగే వదిలేసిన వాటర్ ట్యాంక్ తీవ్ర ప్రమాదానికి కారణమయ్యే పరిస్థితి నెలకొంది. ఎప్పుడు పై నుంచి శిథిలాలు కూలిపోతాయో తెలియని పరిస్థితిలో రోగులు, వారి బంధువులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వందల సంఖ్యలో రోగులు, వారి సహాయకులు రాకపోకలు సాగిస్తుంటారు.



ముఖ్యంగా ఎం.సి.హెచ్. (మదర్ అండ్ చైల్డ్ హెల్త్) బ్లాక్‌కు వెళ్లే గర్భిణీ స్త్రీలు ఇదే మార్గాన్ని ఉపయోగిస్తున్నారు. అయినప్పటికీ ప్రమాదకరంగా మారిన ఈ నిర్మాణాన్ని పూర్తిగా తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా, ఇదే ప్రాంతంలో ద్విచక్ర వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయడంతో వందల సంఖ్యలో వాహనాలు నిలిపివేస్తున్నారు. ఒకవేళ శిథిలాలు కూలిపోతే ప్రాణనష్టం, ఆస్తినష్టం సంభవించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత సూపరింటెండెంట్ హయాంలోనే ఈ సమస్యను పట్టించుకోలేదని, అదే నిర్లక్ష్య ధోరణి ఇప్పటికీ కొనసాగుతోందని ఆసుపత్రికి వచ్చే ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత సూపరింటెండెంట్ అయినా ఈ ప్రమాదకర పరిస్థితిపై వెంటనే స్పందించి వాటర్ ట్యాంక్‌ను పూర్తిగా తొలగించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తారా? లేక గత సూపరింటెండెంట్ మాదిరిగానే ఈ సమస్యను పట్టించుకోకుండా వదిలేస్తారా? అనే ప్రశ్నలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి.

## రాష్ట్రంలో కరోనా కేసులు మళ్లీ కలకలం రేపుతున్నాయి.



ఎన్టీఆర్ జిల్లా,జగ్గయ్యపేట. నిర్భయవార్త జిల్లా ప్రతినిధి:. మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా పొదుపు సంఘాల సభ్యులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. తాము తీసుకున్న రుణాలను పూర్తిగా చెల్లించి, పొదుపు సంఘాల నుంచి వైదొలగేందుకు అవసరమైన సంతకాల కోసం కొంతమంది సి.సి., వీఓఏలు ఒక్కో సభ్యురాలి నుంచి రూ. 1,000 చొప్పున డబ్బులు డిమాండ్ చేస్తున్నారని మహిళలు ఆరోపిస్తున్నారు. పొదుపు సంఘాల నుంచి ఎలాంటి అక్రమ వసూళ్లు చేయరాదని ఉన్నతాధికారులు పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొందరు ఆ ఆదేశాలను పట్టించుకోవడం లేదని బాధిత మహిళలు వాపోతున్నారు. అంతేకాకుండా, పొదుపు సంఘాలకు కొత్త రుణాలు మంజూరు కావాలంటే ఒక మండల నాయకుడి సిఫార్సు తప్పనిసరిగా ఉండాలని తమపై ఒత్తిడి తీసుకొస్తున్నారని కూడా మహిళలు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత ఎక్కడుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఓ గ్రామానికి చెందిన మహిళలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, “రుణం పూర్తిగా చెల్లించినా సంతకం కోసం డబ్బులు అడుగుతున్నారు. సిఫార్సులు లేకపోతే పనులు జరగడం లేదు. మాకు న్యాయం చేయాలి” అని కోరారు. ఈ ఆరోపణలపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, వాస్తవాలను విచారించి, అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

# ఆశావాదం.. ఆయుష్షుకు బలం!

మనిషి ఎంతకాలం జీవిస్తాడో జన్యువులు, మంచి ఆహారం, వ్యాయామం మాత్రమే కాదు.. అతని మనస్తత్వం కూడా కొంతవరకు నిర్ణయిస్తుందని తాజా పరిశోధనలు చెబుతున్నాయి. పరిస్థితులు ఎంత ప్రతికూలంగా ఉన్నా ఆశతో జీవించడం, సమస్యలపై కాకుండా పరిష్కారాలపై దృష్టి పెట్టడం, రేపటి మీద నమ్మకంతో ముందుకు సాగడం వంటి ఆశావాద దృక్పథం శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాదు.. జీవితకాలాన్ని కూడా పెంచగలదని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ అంశానికి హాలీవుడ్ నటుడు, డ్యాన్సర్ డిక్ వాన్ డైక్ జీవితం ఓ ఉదాహరణగా నిలుస్తోంది. 2025 డిసెంబర్ 13న ఆయన తన వందో పుట్టినరోజును జరుపుకున్నారు. ఆ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు ఆశావాదం, దీర్ఘాయుష్షు మధ్య ఉన్న సంబంధంపై మరోసారి చర్చకు దారితీశాయి.






### ఆశే ఆయుష్షు

'100 Rules for Living to 100' పేరుతో డిక్ వాన్ డైక్ తన వందో పుట్టినరోజు సందర్భంగా ఓ పుస్తకాన్ని ప్రచురించారు. 'నేను ఎప్పుడూ అసహనంగా, ఒత్తిడితో నిద్ర లేవలేదు' అని అందులో పేర్కొన్నారు. నిత్యం చురుకుగా ఉండడం, ఇష్టమైన పని చేస్తూ ఉండడం, జీవితాన్ని ఆనందంగా స్వీకరించడమే తన ఆరోగ్యానికి, దీర్ఘాయుష్షుకు కారణమని చెప్పారు. ఇవి వ్యక్తిగత అనుభవాలుగా అనిపించినా, శాస్త్రీయ అధ్యయనాలు కూడా వాటిని సమర్థిస్తున్నాయి. 2025లో 'ది కన్వర్సేషన్' వెబ్‌సైట్‌లో ఆరోగ్య శాస్త్రవేత్త జోలాంటా బర్క్ రాసిన వ్యాసంలో డిక్ వాన్ డైక్ వంటి ఆశావాదులు ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఆమె 1930లో ప్రారంభమైన 'నన్ స్టడీ'ని ప్రస్తావించారు. నన్‌లుగా మారిన కొంతమంది మహిళలను వారి జీవితకథలు రాయమని కోరారు. ఆరు దశాబ్దాల తరువాత వాటిని విశ్లేషించగా, సానుకూల భావోద్వేగాలను ఎక్కువగా వ్యక్తం చేసిన వారు సగటున పదేళ్లు ఎక్కువ కాలం జీవించినట్లు పరిశోధకులు గుర్తించారు.

### పరిశోధనల సాక్ష్యం

ఆశావాదం అంటే కేవలం సానుకూలంగా ఆలోచించడం మాత్రమే కాదు. జీవితంలో సంతృప్తిని అనుభవించడం కూడా. ప్రపంచంలోనే అత్యంత సుదీర్ఘమైన మానవాభివృద్ధి అధ్యయనాల్లో ఒకటి 1938 నుంచి కొనసాగుతోంది. దాదాపు తొమ్మిది దశాబ్దాలుగా సాగుతున్న ఈ అధ్యయనంలో వందలాది పరిశోధనా పత్రాలు, ప్రశ్నావళులు, వైద్య పరీక్షలు, ముఖాముఖి ఇంటర్వ్యూల ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించారు. సంతోషకరమైన సంబంధాలు, జీవితంపై సంతృప్తి, ఆశావహ దృక్పథం ఉన్నవారు వృద్ధాప్యంలో మెరుగైన ఆరోగ్యాన్ని అనుభవిస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. 2019లో యునైటెడ్ కింగ్‌డమ్‌లో నిర్వహించిన మరో అధ్యయనం కూడా ఇదే విషయాన్ని బలపరిచింది. ఆశావాద దృక్పథం కలిగినవారికి సగటున 15 శాతం ఎక్కువ కాలం జీవించే అవకాశం ఉన్నట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. రెండు పెద్ద జనాభా సమూహాలపై నిర్వహించిన ఈ అధ్యయనంలో అధిక ఆశావాదం కలిగిన వారికి 'అసాధారణ దీర్ఘాయువు' (85 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం జీవించడం) సాధించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తేలింది.

### సంబంధాలే సంపద

యుక్తవయసులో స్నేహితులు, కుటుంబ సభ్యులతో మంచి సంబంధాలు పెంచుకున్న వారు 80 ఏళ్ల వయసులోనూ మెరుగైన ఆరోగ్యంతో జీవిస్తున్నట్లు అధ్యయనాలు వెల్లడించాయి. వారికి వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా ఉండటమే కాకుండా, అనారోగ్యాల నుంచి త్వరగా కోలుకునే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయని గుర్తించారు. దీనికి ఖచ్చితమైన కారణాన్ని ఇంకా నిర్ధారించలేదు. అయితే మంచి సామాజిక సంబంధాలు రోజువారీ ఒత్తిడి, ఆందోళనల ప్రభావాన్ని తగ్గిస్తాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. 90 ఏళ్ల వయసును చేరుకోవడంలో దాదాపు 30 శాతం వరకు జన్యుపరమైన అంశాలు, 70 శాతం వరకు జీవనశైలి ప్రభావం చూపుతుందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, తగిన నిద్రతో పాటు ఆశావహ దృక్పథం కూడా ఇందులో భాగమే. ఈ దృక్పథం అలవడడంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆప్తుల ప్రోత్సాహం ఉపయోగపడుతుంది. అలాగే జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం ఉండటం కూడా ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి దోహదపడుతుందని అమెరికా అధ్యయనాలు సూచిస్తున్నాయి. 50 ఏళ్లు దాటిన తరువాత శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్న చాలామందికి అర్థవంతమైన జీవిత లక్ష్యాలు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

నూరేళ్ల ఆయుష్షుకు ఎవరూ హామీ ఇవ్వలేరు. అలాగే ఆశావాద దృక్పథమే ఒక్కటే దీర్ఘాయుష్షుకు కారణమని కూడా చెప్పలేం. కానీ ఆరోగ్యకరమైన జీవనశైలి, మంచి సామాజిక సంబంధాలు, జీవితంపై సంతృప్తి, ఆశావహ దృక్పథం కలిసి దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించే అవకాశాలను పెంచుతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. అందుకే శరీరాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటామో, మనసునూ అంతే ఆరోగ్యంగా ఉంచుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

## మిక్సీ జార్ మూత ఇలా టైట్ చేయండి..

వంటగదిలో ప్రతిరోజూ ఉపయోగించే ఎలక్ట్రానిక్ వస్తువుల్లో మిక్సర్ గ్రైండర్ (మిక్సీ) ఒకటి. మసాలాలు నూరాలన్నా, చట్నీలు చేయాలన్నా, జ్యూస్‌లు పట్టుకోవాలన్నా మిక్సీ ఉండాల్సిందే. అయితే, తరచూ మిక్సీ జార్ మూత లూజ్ అయిపోతుంటుంది. దీంతో మిక్సీ ఆన్ చేయగానే లోపల ఉన్న పదార్థాలు బయటకు చిమ్మి ఇల్లంతా గందరగోళం అవుతుంది. అలాంటప్పుడు మిక్సీ తిప్పినంతసేపూ మూతను చేత్తో గట్టిగా పట్టుకోవాల్సి వస్తుంది. అలా కాకుండా, మూతను ఇలా టైట్ చేసుకోవచ్చు.

* మిక్సీ జార్ మూత లూజ్ అవ్వడానికి ప్రధాన కారణం దానికి ఉండే రబ్బర్ గ్యాస్కెట్ (రబ్బర్ రింగ్) సాగిపోవడమే. దీన్ని ఫిక్స్ చేయడానికి ముందుగా మూతకున్న రబ్బర్‌ను విడిగా తీసి, బాగా మరుగుతున్న వేడి నీళ్లలో కాసేపు వేయాలి. ఆ వెంటనే దానిని తీసి, ఐస్ ముక్కలు ఉన్న చల్లటి నీళ్లలో 5 నుంచి 10 నిమిషాల పాటు ఉంచాలి. ఉష్ణోగ్రతలో వచ్చే ఈ హఠాత్తు మార్పు వల్ల సాగిపోయిన రబ్బర్ తిరిగి ముడుచుకుని తన పాత సైజుకు వచ్చేస్తుంది. దీంతో మూత జార్‌కు పక్కాగా ఫిట్ అవుతుంది.

* మిక్సీ జార్ పైభాగంలో (మూత పెట్టే చోట) ఒకటి లేదా రెండు లావుపాటి రబ్బర్ బ్యాండ్ లను గట్టిగా చుట్టేయాలి. ఆ తర్వాత మూత పెట్టాలి. ఈ రబ్బర్ బ్యాండ్‌లు అదనపు గ్రిప్‌ను ఇస్తాయి. దీనివల్ల మిక్సీ ఎంత స్పీడ్‌గా తిరిగినా మూత అస్సలు కదలదు. సమయం తక్కువగా ఉండి అర్జెంట్‌గా మిక్సీ పట్టుకోవాల్సిన సమయంలో ఈ ట్రిక్ బాగా పనిచేస్తుంది.

* జార్ మూతకున్న రబ్బర్ రింగ్‌ను బయటకు తీయాలి. ఇప్పుడు ఆ మూతకు రబ్బర్ కూర్చునే గాడిలో లావుపాటి కాటన్ దారం లేదా సెల్లో టేప్‌ను రెండు మూడు రౌండ్లు చుట్టాలి. ఆ తర్వాత దానిపై మళ్లీ రబ్బర్ రింగ్‌ను ఎప్పటిలాగే ఫిట్ చేయాలి. ఇలా చేయడం వల్ల రబ్బర్ కొద్దిగా బయటకు వచ్చి జార్‌పై మూత చాలా గట్టిగా, గ్రిప్‌గా కూర్చుంటుంది.



# కూసున్న కొద్దీ.. గుండెకు సుస్తీ!

బోర్ కొట్టినా.. పని ఎక్కువగా ఉన్నా స్క్రీన్‌కే అతుక్కునే రోజులివి. వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ గంటలతరబడి కూర్చోవడం.. స్కూల్‌బస్‌లో.. ప్రయాణంలో.. ఆఫీసులో, టీవీ ముందు, థియేటర్‌లో, వాహనంపై ఇలా స్థలం మారినా కూర్చోవడం మారటం లేదు. ఇలా ఎక్కువసేపు కూర్చోవడం వల్ల వచ్చే సమస్యల్లో గుండె సంబంధిత ఇబ్బందులు ముందువరుసలో ఉన్నాయంటున్నారు వైద్యనిపుణులు. రోజంతా గంటల తరబడి కూర్చోవడం వల్ల గుండె పనితీరు మందగించి గుండె సంబంధిత రోగాలు వస్తున్నాయి అంటున్నారు వైద్యనిపుణులు. ఉదయం లేచింది మొదలు, నిద్రించే వరకు ఆఫీసుకు వెళ్లే ప్రయాణంలో, ఆఫీసులో ఎనిమిది గంటలు కూర్చోవడం, వర్క్ ఫ్రం హోమ్, ఇంటికి వచ్చాక టీవీ చూడటం, మొబైల్ వాడటం ఇలా కారణం ఏదైనా కావచ్చు.. నిరంతరంగా కదలికలు లేకుండా.. ఎక్కువ సేపు కూర్చుంటూ గుండెకు ముప్పు తెస్తున్నాం.

**వ్యాయామం మాత్రమే సరిపోదు..**

చాలామంది ఉదయం చేసే వాకింగ్, స్ట్రెచింగ్, వ్యాయామాలు, ఆసనాలు, జిమ్ వంటివి చేసి రోజంతా కూర్చున్నా ఫర్వాలేదు అనుకుంటారు. కానీ, వ్యాయామం చేసినంత మాత్రాన కదలిక లేకుంటే ముప్పు తప్పదని హెచ్చరిస్తున్నారు వైద్య పరిశోధకులు. గంటల తరబడి కూర్చోవడం వల్ల ఎదురయ్యే సమస్యలు వెంటనే కనబడకపోవడం వల్ల ఏం జరుగుతుందిలే అనుకుంటారు. కానీ,



ఈ బైఠాయింపు శరీరంలో అనేక మార్పులకు కారణం అవుతుందట. ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల మెటబాలిజం మందగించి, శరీరంలో క్యాలరీల ఖర్చు తగ్గిపోతుంది. చెక్కర స్థాయులు పెరుగుతాయి. దీనివల్ల ఇన్సులిన్ పనితీరుపై ప్రభావం పడుతుంది. ఫలితంగా రక్తనాళాల్లో కొవ్వు పేరుకొని గుండెకు ముప్పు వాటిల్లుతుందని నిపుణుల మాట.

**మనవారికి ఎక్కువ ముప్పు**

జన్యుపరమైన ఇబ్బందులు, జీవనశైలిలో మార్పు కారణాలు ఏవైతేనేం.. యుక్తవయసులోనే గుండె జబ్బుల బారినపడుతున్న వారిలో భారతీయులు ముందున్నారు. ఎవరైతే తక్కువ కదలికలతో రోజులు వెళ్లదీస్తున్నారో వారిలో కార్డియో సమస్యలు ఎక్కువ వచ్చినట్లు వర్క్ ఫ్రం హోం ఉద్యోగులపై చేసిన అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ఒకప్పుడు కొలీగ్‌తో మాట్లాడటానికి నడిచి వెళ్లేవారు. పని ప్రదేశాల్లో మెట్లు ఎక్కేవారు, అవసరమైతే పరుగులు తీసేవారు. వారందరినీ నేడు టెక్నాలజీ స్థిరంగా కూర్చోబెట్టి మొత్తం పనిని మెసేజ్, వీడియోకాల్స్, ఫోన్‌కాల్స్ అంటూ ఒక క్లిక్‌కి మాత్రమే పరిమితం చేసింది. తమాషా ఏంటంటే టెక్నాలజీ మన పనిని సులభం చేసి.. మన దినచర్యలో కదలికలను గుప్పెట్లో పెట్టుకొని ఆయుర్దాయాన్ని తగ్గిస్తున్నది.

**కదలికలే.. స్నేహితులు**శరీర నిశ్చలస్థితి వల్ల మెటబాలిజంలో, గుండె కండరాల్లో, రక్తనాళాల్లో జరిగే మార్పులు పెనుముప్పునకు దారితీయవచ్చు. మరి ఈ ముప్పునుంచి బయటపడే మార్గమే లేదా? ఉంది అంటున్నారు ఆరోగ్య పరిశోధకులు. రోజులో తక్కువ కదలికలు ఉండే వారు సాధారణంగా ఫిట్‌నెస్ ట్రైనర్స్ సూచించే వ్యాయామాలను రెట్టింపు చేస్తేనే ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చని సలహా ఇస్తున్నారు.

**డెడికేటెడ్ వర్కవుట్ సెషన్స్‌పై ఆధారపడే కంటే పని వేళల్లో ప్రతి గంటకు 5 నిమిషాలు నడవడం అలవాటుగా చేసుకోవాలి.**

ఫోన్ మాట్లాడేటప్పుడు, సహోద్యోగులతో ఆలోచనలను పంచుకొనేటప్పుడు నడకకు ప్రాధాన్యం ఇవ్వాలి.

# ఈ ఆయుర్వేద కషాయాలతో వర్షాకాలంలో జలుబుకు చెక్!




వర్షాకాలంలో వాతావరణంలో మార్పుల కారణంగా జలుబు, దగ్గు, గొంతునొప్పి, జీర్ణ సమస్యలు వంటి ఇబ్బందులు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఇలాంటి సమయంలో శరీరానికి వెచ్చదనం కలిగించేందుకు, సాధారణ ఆరోగ్యానికి తోడ్పడేందుకు చాలామంది ఆయుర్వేద కషాయాలను తాగుతుంటారు. తులసి, అల్లం, పసుపు, మిరియాలు, దాల్చినచెక్క వంటి సహజ పదార్థాలతో తయారుచేసే ఈ కషాయాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు.

**తులసి -- అల్లం కషాయం**

తులసి--అల్లం కషాయం తయారు చేయడానికి 10 నుంచి 12 తులసి ఆకులు, ఒక అంగుళం అల్లం ముక్క, నాలుగు నల్ల మిరియాలు, చిన్న దాల్చినచెక్క ముక్క, రెండు లవంగాలు, రెండు కప్పుల నీరు తీసుకోవాలి. ముందుగా నీటిని మరిగించి అందులో అన్ని పదార్థాలను వేసి 10 నుంచి 15 నిమిషాలు సన్నని మంటపై మరిగించాలి. తర్వాత వడకట్టి కొద్దిగా చల్లారిన అనంతరం కావాలనుకుంటే తేనె కలిపి తాగవచ్చు.

**పసుపు -- నల్ల మిరియాల కషాయం**

పసుపు--నల్ల మిరియాల కషాయం తయారు చేయడానికి అర టీస్పూన్ పసుపు పొడి, అర టీస్పూన్ నల్ల మిరియాల పొడి, ఒక అంగుళం అల్లం ముక్క, చిన్న దాల్చినచెక్క ముక్క, రెండు కప్పుల నీరు తీసుకోవాలి. ముందుగా నీటిలో అన్ని పదార్థాలను వేసి 12 నుంచి 15 నిమిషాల పాటు సన్నని మంటపై బాగా మరిగించాలి. అనంతరం వడకట్టి గోరువెచ్చగా తాగాలి. కావాలనుకుంటే కషాయం కొద్దిగా చల్లారిన తర్వాత ఒక టీస్పూన్ తేనె కలిపి తీసుకోవచ్చు.

**లవంగం -- దాల్చినచెక్క కషాయం**

లవంగం -- దాల్చినచెక్క కషాయం తయారు చేయడానికి నాలుగు లవంగాలు, చిన్న దాల్చినచెక్క ముక్క, రెండు కప్పుల నీరు తీసుకోవాలి. ముందుగా లవంగాలు, దాల్చినచెక్కను స్వల్పంగా దంచి నీటిలో వేయాలి. సుమారు 15 నిమిషాల పాటు సన్నని మంటపై బాగా మరిగించాలి. అనంతరం వడకట్టి గోరువెచ్చగా తాగాలి. ఈ కషాయం సువాసనతో పాటు వెచ్చదనాన్ని కూడా అందిస్తుంది.




# ఏం మాట్లాడాలన్నా భయం వేస్తోంది.. మీడియా విస్తృతిపై కింగ్ నాగార్జున టెన్షన్!

ఒక సినిమా ఈవెంట్‌లో కింగ్ నాగార్జున నేటి మీడియా పరిణామాలపై, సోషల్ మీడియా విస్తృతిపై చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. ఒక సినిమా ఈవెంట్‌లో కింగ్ నాగార్జున పరిణామాలపై, సోషల్ మీడియా వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా నేటి కాలానికి మీడియా రంగంలో గుర్తుచేసుకుంటూ సరదాగా.. అదే మాట్లాడిన మాటలు సినిమా ప్రేక్షకులను సైతం ఎంతగానో నాగార్జున తన గతాన్ని --ఆరోజుల్లో నేను ఇండస్ట్రీకి వచ్చిన కేవలం ఆరుగురు మీడియా వ్యక్తులు అండ్ ఏ (క్యూ) సెషన్ కోసం ఉ



నేటి మీడియా విస్తృతిపై చేసిన ఆసక్తికర మారాయి. నాటి కాలానికి, వచ్చిన మార్పులను ఆయన సమయంలో కాస్త టెన్షన్‌గా ఇండస్ట్రీతో పాటు సాధారణ ఆకట్టుకుంటున్నాయి. గుర్తుచేసుకుంటూ.. కొత్తలో ప్రెస్ మీట్ పెడితే మాత్రమే నా ముందు క్యూ ండేవారు. అలాగే ఒకే ఒక్క ఫోటోగ్రాఫర్ ఉండేవారు. వాళ్లు అడిగే ప్రశ్నలు.. మనం చెప్పే సమాధానాలు చాలా పరిమితంగా.. ఎంతో ప్రశాంతంగా సాగిపోయేవి! అని పాత రోజులను ఎంతో గుర్తుచేసుకున్నారు. కానీ ఈరోజు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మా(లెనిన్ టీమ్) చుట్టూ ఇంతమంది మీడియా ప్రతినిధులు, ఇన్ని మైకులు, వందలాది కెమెరాలు కనిపిస్తున్నాయి. ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటోంది. ఇప్పుడు ఏ చిన్న తప్పు మాట్లాడినా, ఏమరపాటుగా ఏ పదం నోరు జారినా క్షణాల్లో వైరల్ అయిపోతుంది. అందుకే ఇప్పుడు మీడియా ముందు నిలబడి ఏం మాట్లాడాలన్నా ఒక రకమైన భయం వేస్తోంది! అంటూ నాగార్జున నవ్వుతూ తన మనసులోని అసలు టెన్షన్‌ను బయటకు చెప్పారు. నిజానికి ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు మీడియా వేవ్ పూర్తిగా మారిపోయింది. ప్రస్తుతం యూట్యూబ్ చానెళ్లు, వెబ్‌సైట్లు, డిజిటల్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల రాకతో సెలబ్రిటీల న్యూస్ కవరేజ్ ఎంతో జోష్‌ఫుల్‌గా సాగుతోంది. ఒకప్పుడు కేవలం ఒక డజను ప్రధాన పత్రికలు... మరో డజను ప్రధాన ఎలక్ట్రానిక్ (టీవీ) మీడియాలు.. ఒక అరడజను పురాతన సినిమా మ్యాగజైన్లు మాత్రమే టాలీవుడ్ సెలబ్రిటీ న్యూస్‌ను కవర్ చేస్తున్నాయనుకుంటే పొరపాటే అవుతుంది. ప్రస్తుతం డిజిటల్ విప్లవం పుణ్యమా అని ఎక్కడ చూసినా వందలాది సరికొత్త మీడియా ప్లాట్‌ఫామ్‌లు పుట్టుకొచ్చాయి. ఇప్పుడు యూట్యూబ్ చానెళ్లు, డిజిటల్ నెట్‌వర్క్‌లు, ఇన్ స్టా పేజీలు వగైరా వగైరా అన్ని కలుపుకుని ప్రతి ఈవెంట్‌లోనూ దాదాపు 100 మందికి పైగా మీడియా ప్రతినిధులు మైకులతో సిద్ధంగా ఉంటున్నారు.

# ఫ్యాన్స్ కు క్షమాపణ చెప్పిన కోలీవుడ్ నటుడు



పర్సనల్ రీజన్స్ వల్ల సినిమాలకు దూరంగా ఉంటానని గతంలో ప్రకటించిన రవి, ఆ డెసిషన్ ను వెనక్కి తీసుకుంటూ ఫ్యాన్స్ కు బహిరంగంగా క్షమాపణ చెప్పడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కోలీవుడ్ నటుడు రవి మోహన్(జయం రవి) మరోసారి తన కెరీర్‌పై పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకు సిద్ధమయ్యారు. గత కొన్ని నెలలుగా పర్సనల్ లైఫ్ కు సంబంధించిన వివాదాలతో వార్తల్లో నిలిచిన ఆయన, ఇప్పుడు ఎమోషనల్ స్పీచ్‌తో కొత్త ఆరంభాన్ని ప్రకటించారు. పర్సనల్ రీజన్స్ వల్ల సినిమాలకు దూరంగా ఉంటానని గతంలో ప్రకటించిన రవి, ఆ డెసిషన్ ను వెనక్కి తీసుకుంటూ ఫ్యాన్స్ కు బహిరంగంగా క్షమాపణ చెప్పడం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది ఒక సినీ కార్యక్రమంలో పాల్గొన్న రవి మోహన్, తన లైఫ్ లో ఒక కీలక దశ ముగిసిందని, ఇప్పుడు పూర్తిగా కొత్త అధ్యాయం ప్రారంభమవుతోందని అన్నారు. ఇది తనకు రెండో జన్మ లాంటిదంటూ చేసిన కామెంట్స్ ఆయన మానసిక స్థితిని ప్రతిబింబించాయి. గతంలో జరిగిన పరిణామాలను వెనక్కి వదిలేసి, ఇకపై యాక్టర్‌గా ఆడియన్స్ ను మంచి సినిమాలతో అలరించడమే తన మెయిన్ టార్గెట్ అని స్పష్టం చేశారు. కొద్ది నెలల క్రితం రవి మోహన్ వ్యక్తిగత జీవితం తీవ్ర చర్చకు దారి తీసింది. భార్య ఆర్తితో ఏర్పడిన విభేదాలు, తర్వాత సింగర్ కెనీషాతో ఆయన పేరు వినిపించడం, సోషల్ మీడియాలో వచ్చిన విమర్శలు వరుసగా వార్తల్లో నిలిచాయి. సిట్యుయేషన్స్ మరింత ఉద్రిక్తంగా మారడంతో మీడియా ముందుకు వచ్చిన రవి, తనపై, కెనీషాపై జరుగుతున్న ట్రోలింగ్, ఆరోపణలపై స్పందించారు. ఆ తర్వాత రవి మోహన్ కొంతకాలం పూర్తిగా మీడియాకు దూరంగా ఉన్నారు. కొత్త సినిమాల గురించి కూడా ఎలాంటి అనౌన్స్‌మెంట్స్ చేయలేదు. దీంతో ఆయన కెరీర్‌పై అనేక ఊహాగానాలు వినిపించాయి. అయితే ఇప్పుడు అదే రవి మోహన్ మళ్లీ ప్రజల ముందుకు వచ్చి తన నిర్ణయాన్ని మార్చుకోవడం, అభిమానులను ఉద్దేశించి క్షమాపణ చెప్పడం ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. తన స్పీచ్ లో ఇప్పటివరకు తాను పోషించిన గుర్తుండిపోయే పాత్రలను ప్రస్తావించిన రవి, ఫ్యూచర్ లో కూడా అలాంటి పాత్రలతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. గతాన్ని గుర్తు చేసుకుంటూ బాధపడటం కంటే, కొత్త టార్గెట్స్ తో ముందుకు సాగడమే తన డెసిషన్ అని ఆయన వివరించారు. ఇక రవి మోహన్ రీఎంట్రీకి ఆయన స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతున్న బ్రో కోడ్ వేదిక కానుంది. ఈ సినిమాలో తెలుగమ్మాయి శ్రీ గౌరీ ప్రియ హీరోయిన్ గా నటిస్తున్నారు. పర్సనల్ వివాదాల తర్వాత రవి మోహన్ చేస్తున్న ఈ కొత్త ఆరంభం ఆయన కెరీర్‌కు ఎంతవరకు కొత్త ఊపు తీసుకువస్తుందో, అభిమానులు ఆయనను ఎలా ఆదరిస్తారో చూడాల్సి ఉంది.

# ఇక మెగా మేనల్లుడు 2027లోనేనా?

తొలి సినిమాతోనే రికార్డు స్థాయి వసూళ్లు సాధించి టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించిన వైష్ణవ్ అటుపై అంచనాలను అందుకోవడంలో కొంత తడబడ్డాడు. మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ -ఉప్పెన- తో ఎలాంటి సక్సెస్ చూసాడో? చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమాతోనే రికార్డు స్థాయి వసూళ్లు సాధించి టాలీవుడ్‌లో సెన్సేషన్ సృష్టించిన వైష్ణవ్ అటుపై అంచనాలను అందుకోవడంలో కొంత తడబడ్డాడు. ఆ క్రమంలో కొన్ని చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోవడంతో ఆయన సినిమాల ఎంపికలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వైష్ణవ్ వెండితెరకు దూరమై మూడేళ్లు



దాటిపోవడంతో? అసలు ఆయన ఎందుకు గ్యాప్ తీసుకున్నారనే చర్చ సోషల్ మీడియాలో జోరందుకుంది. వైష్ణవ్ తేజ్ ఇంత సుదీర్ఘ విరామం తీసుకోవడానికి కారణం సరైన కథ దొరక్కపోవడమే అని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చిన కథలు తన ఇమేజ్‌కి తగ్గట్టుగా లేకపోవడంతో తొందరపడి సినిమాలు చేయకూడదని గట్టిగా నిర్ణయించుకున్నారట. ఏదైనా కథను ఎంచుకుంటే? అది ఖచ్చితంగా ప్రేక్షకులని మెప్పించేలా ఉండాలని ప్రయోగాల కంటే కంటెంట్ ప్రధానమైన చిత్రాలకే ప్రాధాన్యత ఇవ్వాలని పట్టుదలగా ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా వైష్ణవ్ తేజ్ అభిమానులకు ఓ ముఖ్యమైన అప్డేట్ అందుతోంది. వైష్ణవ్ తిరిగి మేకప్ వేసుకోవడానికి సిద్ధమ వుతున్నారని అయితే ఆ ప్రాజెక్ట్ 2027లోనే పట్టాలెక్కే అవకాశం ఉందని తెలిసింది. మూడేళ్ల విరామం తర్వాత వైష్ణవ్ తేజ్ రాక కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ గ్యాప్‌ను ఆయన ఖాళీగా గడపకుండా నటనలో మెరుగులు దిద్దుకోవడానికి .. బాడీ లాంగ్వేజ్‌ని మార్చుకోవడానికి ఉపయోగిస్తున్నట్లు సమాచారం. 2027లో రాబోయే వైష్ణవ్ తేజ్ చిత్రం కెరీర్‌ను మలుపు తిప్పేదిగా ఉంటుందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. కథ ఎంపిక దగ్గర్నుంచి దర్శకుడి వరకు ప్రతి విషయంలోనూ వైష్ణవ్ చాలా స్పష్టతతో ఉన్నారట. వైష్ణవ్ తీసుకుంటున్న సుదీర్ఘ విరామం ఒక రకంగా సరైందేనని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. కెరీర్ ప్రారం భంలో వచ్చే ఫ్లాపులు హీరోల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తాయి. కానీ విరామం తీసుకుని పక్కా ప్లానింగ్‌తో వస్తే మళ్లీ పుంజుకోవడానికి అవకాశం ఉంటుంది. వైష్ణవ్ తేజ్ తీసుకుంటున్నఈ గ్యాప్ ఒక -సెల్ఫ్-కరెక్షన్- లాంటిది. పరాజయాల నుంచి పాఠాలు నేర్చుకోవొచ్చు. తనలోని లోపాలను సరిదిద్దుకొవచ్చు. 2027లో పవర్‌ఫుల్ కమ్‌బ్యాక్ ఇవ్వడానికి ఆయన సిద్ధమవుతున్నారు. మూడేళ్ల నిరీక్షణ తర్వాత వైష్ణవ్ వేసే ప్రతి అడుగు జాగ్రత్తగా, ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని ఆశిద్దాం.

# ధనుష్ భారీ ప్రాజెక్ట్ దర్శకుడుపై సస్పెన్స్.. శంకర్ కూడానా?




కోలీవుడ్ స్టార్ నటుడు ధనుష్ మాస్ స్పీడ్ తో తన సినిమాలు కంప్లీట్ చేస్తూ వస్తాడని అందరికీ తెలిసిందే. అలా ఇప్పుడు కూడా కొన్ని సినిమాలు ఆల్రెడీ సెట్స్ మీద ఉన్నాయి. అయితే ఈ సినిమాలు కాకుండా మరో కొత్త సినిమా విషయంలో క్రేజీ బజ్ ఇపుడు నెలకొంది. డి వి అంటూ రెండు అక్షరాలు పెట్టి విడుదల చేసిన పోస్టర్ కోలీవుడ్ సహా తెలుగు ఆడియెన్స్ లో ఆసక్తి రేపింది. అయితే ధనుష్ తో వర్క్ చేసే ఆ దర్శకుడు ఎవరు అనేదే పెద్ద సస్పెన్స్ గా మారింది. వెట్రిమారన్, వెంకట్ ప్రభు వినోద్ చోప్రా ఇలా పలువురు దర్శకులతో పాటుగా ఇండియన్ జేమ్స్ కేమెరూన్ శంకర్ పేరు కూడా వినిపిస్తుంది. ఇదెలా అంటే శంకర్ చేయనున్న డ్రీం ప్రాజెక్ట్ 'వేల్పరి' సినిమా కావచ్చని అనేక రూమర్స్ ఇపుడు ధను భారీ ప్రాజెక్ట్ చుట్టూతా తిరుగుతున్నాయి. సో అసలు ధనుష్ ఎవరితో చేయనున్నాడు అనేది రేపు జూలై 10తో ఓ క్లారిటీ వచేస్తుంది.

# కాజల్ రోల్ రూమర్స్ పై క్లారిటీ ఇచ్చేసిందిగా!

ఎన టాలీవుడ్ లో ఉన్నటువంటి స్టార్ హీరోయిన్స్ లో బ్యూటీ కాజల్ అగర్వాల్ కూడా ఒకరు. ఇప్పుడు లీడ్ పాత్రలతో పాటుగా హీరోయిన్ గా కూడా పలు సినిమాలు చేస్తుంది. అలా లేటెస్ట్ గా నందమూరి నట సింహం బాలకృష్ణ కాంబినేషన్ లో ఓ సినిమా చేస్తుంది. ఆల్రెడీ భగవంత్ కేసరి సినిమాలో చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు బాలయ్య 111వ సినిమాలో ఆమె నటిస్తుండగా ఆమె తాలూకా ఫస్ట్ లుక్ కూడా మేకర్స్ వదిలారు. అయితే ఆమె రోల్ పై రీసెంట్ గా ఓ



ఇంట్రెస్టింగ్ బజ్ వచ్చింది. ఆమె ఈ సినిమాలో ఓ సీరియస్ రోల్ లో ముంబై క్రైమ్ బ్రాంచ్ ఆఫీసర్ గా కనిపిస్తుంది అని టాక్ వచ్చింది. ఇప్పుడు ఆమె లేటెస్ట్ ఇంటర్వ్యూలో కూడా ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. బాలయ్య సినిమాలో తన రోల్ ఫన్నీగా అయితే ఉండదని సీరియస్ గానే ఉంటుంది అని ఆమె క్లారిటీ ఇచ్చింది. సో ఈసారి బాలయ్య వర్సెస్ కాజల్ అనుకోవచ్చు. ఇక ఈ చిత్రానికి గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తుండగా థమన్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే వృద్ధి సినిమాస్ నిర్మాణం వహిస్తున్నారు.

# టాలీవుడ్ వైపు టాక్సిక్ బ్యూటీ!

మలయాళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఇప్పుడు టాలీవుడ్ పై కన్నేసినట్లు సమాచారం. మలయాళ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేకమైన ముద్ర వేసుకున్న ప్రతిభావంతురాలైన దర్శకురాలు గీతూ మోహన్ దాస్ ఇప్పుడు టాలీవుడ్ పై కన్నేసినట్లు సమాచారం. తనదైన మేకింగ్ స్టైల్, ఎమోషనల్ డెప్త్ ఉన్న కథలతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న గీతూ పాన్-ఇండియా స్థాయిలో సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు. -టాక్సిక్- వంటి భారీ చిత్రాలతో తనకంటూ బలమైన ఇమేజ్ ఏర్పరచుకున్న గీతూ ఇప్పుడు నేరుగా తెలుగు సినిమా మార్కెట్‌లోకి ప్రవేశించేందుకు రంగం సిద్ధం



చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గీతూ మోహన్ దాస్ మలయాళ స్టార్ హీరోలతో పనిచేస్తూనే తదుపరి చిత్రాల్లో తెలుగు అగ్ర నటులను భాగస్వాములను చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. గతంలో కేవలం మలయాళం, హిందీ భాషలకే పరి మితమైన ఆమె చిత్రాల పరిధిని ఇప్పుడు తెలుగు ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా మార్చుకోవాలని ఆమె ప్లాన్ చేస్తున్నారు. టాలీవుడ్ లోని కమర్షియల్ ఎలిమెంట్స్ ను తనదైన ఆర్టిస్టిక్ శైలికి జోడించి కొత్త రకమైన సినిమా టిక్ అనుభవాన్ని అందించాలని యోచిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే టాలీవుడ్ లో ఓ స్టార్ హీరోతో చర్చలు జరుపుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల సమాచారం. గీతూ మోహన్ దాస్ క్రియేటివిటీకి, స్టార్ హీరోలకున్న మాస్ ఇమేజ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద అద్భుతాన్ని సృష్టించే అవకాశం లేకపోలేదు. ప్రస్తుతం కథా చర్చలు ప్రాథమిక దశలో ఉన్నప్పటికీ గీతూ కథపై నమ్మకం ఉన్న ఆ అగ్ర నటుడు కూడా ప్రతిపాదనకు సానుకూలంగానే స్పందించినట్లు తెలుస్తోంది. గీతూ మేకింగ్ లో ఉండే డార్క్ అండ్ రా శైలి, తెలుగు ప్రేక్షకులకు కొత్తగా అనిపించే అవకాశం ఉంది. అయితే అగ్ర నటులతో పనిచేసేటప్పుడు తనదైన ప్రత్యేకతను కాపాడుకుంటూనే మాస్ ప్రేక్షకులను ఏ విధంగా మెప్పించ గలదనేది అందరిలోనూ ఆసక్తిని రేకెత్తిస్తోంది. గీతూ ప్రాజెక్ట్ గనుక కార్యరూపం దాలిస్తే ఖచ్చితంగా టాలీవుడ్ లో సంచలనం కానుంది. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే. గీతూ తన టీమ్ తో కలిసి ఇప్పటికే కొన్ని స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసినట్లు తెలుస్తోంది. భారీ బడ్జెట్ తో అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కబోయే ఈ చిత్రం కోసం నిర్మాతలు కూడా భారీగానే ఖర్చు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని వినికిడి. తెలుగు మార్కెట్ లో తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడానికి గీతూ వేస్తున్న అడుగు చాలా కీలకం కానుంది. గీతూ సృజనాత్మకతకు స్టార్ హీరోల గ్లామర్ - యాక్షన్ తోడైతే తెలుగులో మెరవడం ఖాయం. ప్రేక్షకులు కూడా వైవిధ్యమైన కథలను ఆదరించేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో ఆమె రాక టాలీవుడ్ చిత్ర పరిశ్రమకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు. టాక్సిక్ రిలీజ్ అనంతరం ఆమె ఎంత ట్యాలెంటెడ్ అన్నది పూర్తి స్థాయిలో బయట పడుతుంది. - టాక్సిక్- బ్లాక్ బస్టర్ అయితే? తెలుగు హీరోలే ఆమె కోసం క్యూలో ఉంటారు? అనడంలో ఎలాంటి సందేహం లేదు.

Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197